
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
సోమవారం 3 మార్చి 2025





ఈఎస్ఐ ఆస్పత్రి భవనం నమూనా చిత్రం

గురువుల విజేత ఎవరో!

నేడే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు

ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి

మొత్తం ఓటర్లు: **22,493**

పోలైన ఓట్లు: **20,794**



పాకలపాటి రఘువర్మ | గాదె శ్రీనివాసులు నాయుడు | కోరెడ్ల విజయగౌరి



ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపునకు పూర్తయిన ఏర్పాట్లు

- ఓట్ల లెక్కింపునకు 20 టేబుళ్లు, 100 మంది సిబ్బంది
- తొలుత బ్యాలెట్ పత్రాలను కుప్పగా పోసి.. 25 చొప్పున కట్టలు
- డ్రమ్ములో వేసి కలియతిప్పిన తరువాత టేబుళ్లకు సర్దుబాటు
- తొలి ప్రాధాన్యతలో 50 శాతానికి మించి ఒక్క ఓటు వచ్చినా విజేతగా ప్రకటింపు
- ఇదే జరిగితే రాత్రి ఎనిమిది గంటల్లో ఫలితం వెలువడే అవకాశం
- లేకపోతే రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు
- ఫలితం వెల్లడికి మరింత సమయం

విశాఖపట్నం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): **ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఇటీవల జరిగిన ఎన్నికల్లో పోలైన ఓట్ల లెక్కింపు ఈ నెల మూడో తేదీ సోమవారం ఉదయం ప్రారంభం కానున్నది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల ట్రిపుల్ ఈ విభాగంలో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేశారు. ఈ కేంద్రాన్ని విశాఖ జిల్లా డీఆర్వో భవానిశంకర్ ఆదివారం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గత నెల 27వ తేదీన శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లోని 123 పోలింగ్ కేంద్రాల్లో జరిగిన ఎన్నికల్లో 22,493 మంది ఉపాధ్యాయులకుగాను 20,794 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 13,508 మందికిగాను 12,576 మంది, మహిళలు 8,985 మందికి 8,218 మంది ఓటు వేశారు.**

ఓట్ల లెక్కింపునకు 20 టేబుళ్లు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపునకు అధికారులు 20 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్ వద్ద ఇద్దరు చొప్పున సిబ్బంది వుంటారు. వీరికి అదనంగా మరికొంత మంది సిబ్బందిని అందుబాటులో వుంచుతారు. తొలుత సోమవారం ఉదయం అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్ ఓపెన్‌చేసి అక్కడ నుంచి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాలుకు చేరుస్తారు. ఉదయం ఎనిమిది గంటలకు బ్యాలెట్ బాక్సుల సీళ్లను పరిశీలించి, అన్నీ సక్రమంగా వుంటే తెరుస్తారు. అన్ని బాక్సుల్లోని బ్యాలెట్ పత్రాలను కుప్పగా పోస్తారు. తరువాత 25 చొప్పున ఓట్లను కట్టలుగా కడతారు. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత ఓట్ల కట్టలను డ్రమ్ములో వేసి కలియతిప్పుతారు. అనంతరం ఒక్కో టేబుల్‌కు వెయ్యి ఓట్లు.. అంటే 40 కట్టలను అందజేస్తారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేసరికి మధ్యాహ్నం అయ్యే అవకాశం వుంది. భోజనం చేసిన తరువాత టేబుళ్ల వారీగా ఓట్ల లెక్కింపు మొదలుపెడతారు. అభ్యర్థులకు వచ్చిన తొలి ప్రాధాన్యత ఓట్లను వారికి కేటాయించిన ట్రేలలో వేస్తారు. మిగిలిన ఓట్ల కట్టలను కూడా టేబుళ్ల వారీగా సర్దుబాటు చేస్తారు. తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు మొత్తం ఒక రౌండ్‌లోనే చేపడతారు. చెల్లిన ఓట్లలో 50 శాతానికి మించి ఒక్క ఓటు అదనంగా ఎవరికి వస్తే ఆ అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. ఇదే జరిగితే రాత్రి ఎనిమిది గంటలకల్లా ఫలితం వెలువడే అవకాశం వుందని అధికారులు చెబుతున్నారు. ఒకవేళ ఎవరికీ 50 శాతం కన్నా ఎక్కువ ఓట్లు రాకపోతే మొదటి ప్రాధాన్యత ఓట్లలో తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థి నుంచి రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. ఈ విధంగా ఒక్కొక్కరిని ఎలిమినేట్ చేసుకుంటూ వస్తారు. మొదటి స్థానంలో వున్న అభ్యర్థి ఎప్పుడైతే 50 శాతం ఓట్లను అధిగమిస్తారో అప్పుడు రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపును నిలుపుదల చేసి, ఆ అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు.

ఈ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న విశాఖపట్నం కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ నేతృత్వంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తున్న శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల డీఆర్వోలు, ఇతర అధికారులు కౌంటింగ్ కేంద్రంలో ఉంటారు. ఎన్నికల సంఘం తరఫున పరిశీలకునిగా వచ్చిన సీనియర్ ఐఏఎస్ అధికారి ఎం.ఎం.నాయక్ కౌంటింగ్‌ను పర్యవేక్షిస్తారు. మొత్తంగా 100 మంది అధికారులు, సిబ్బంది కౌంటింగ్ విధుల్లో ఉంటారు. కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా 200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈ ఎన్నికల్లో పోటీచేసిన పది మంది అభ్యర్థుల తరఫున మొత్తం 160 మందికి కౌంటింగ్ ... మిగతా 6వ పేజీలో

వచ్చేస్తోంది ఈఎస్ఐ ఆస్పత్రి

అచ్యుతాపురంలో శరవేగంగా భవన నిర్మాణం

- రూ.62.21 కోట్లతో 30 పడకల ఆస్పత్రితోపాటు 16 నివాస గృహసముదాయాలు
- సీపీడబ్ల్యూడీ ఆధ్వర్యంలో పనులు
- వచ్చే ఏడాది ఏప్రిల్‌లోగా పూర్తి
- అందుబాటులోకి రానున్న నిపుణుల వైద్య సేవలు
- వేలాది మంది కార్మికులు, ఉద్యోగులు, వారి కుటుంబాలకు ప్రయోజనం



ప్రత్యేక ఆర్థిక మండలిలో నిర్మాణంలో ఉన్న ఈఎస్ఐ ఆస్పత్రి భవనం

అచ్యుతాపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): **పారిశ్రామికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురంలో మరో ఏడాదిలో ఈఎస్ఐ ఆస్పత్రి అందుబాటులోకి రానున్నది. ప్రస్తుతం భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈఎస్ఐ ఆస్పత్రిలో సేవలు ప్రారంభం అయితే ఎలమంచిలి నియోజకవర్గంతోపాటు పక్కనే వున్న పరవాడ మండలంలోని పరిశ్రమల్లో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులకు ఎంతో మేలు చేకూరుతుంది. ఆయా కంపెనీలు, కర్మాగారాల్లో ప్రమాదాలు సంభవిస్తే.. క్షతగాత్రులైన కార్మికులు, ఉద్యోగులకు సత్వర వైద్య సేవలు అందుతాయి.**

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో విశాఖ నగరంలో మాత్రమే ఈఎస్ఐ ఆస్పత్రి వుంది. అచ్యుతాపురంలో చిన్నపాటి డిస్పెన్సరీ ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు. ఇక్కడ కేవలం ఓపీ మాత్రమే వుంటుంది. పరిస్థితి తీవ్రంగా వున్న కేసులను విశాఖలోని మల్కాపురం ఈఎస్ఐ ఆస్పత్రికి రిఫర్ చేస్తుంటారు. అయితే అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో ఏర్పాటైన ప్రత్యేక ఆర్థిక మండలిలో పదుల సంఖ్యలో పరిశ్రమలు, కంపెనీలు ఏర్పాటు అవుతుండడంతో వీటిల్లో వేలాది మంది కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీటిల్లో తరచూ ప్రమాదాలు సంభవిస్తూ కార్మికులు తీవ్రంగా గాయపడుతున్నారు. వీరిని చికిత్స నిమిత్తం గాజువాక, విశాఖ నగరంలోని ఆస్పత్రులకు తరలిస్తున్నారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తీసుకెళ్లడానికి గంట నుంచి గంటన్నర సమయం పడుతున్నది. దీంతో సకాలంలో వైద్య సేవలు అందక దారిలోనే మృత్యువాత పడుతున్నారు. ఇటువంటి పరిస్థితిని అధిగమించి, ప్రమాదాల్లో గాయపడిన కార్మికులు, ఉద్యోగులకు సత్వరమే వైద్యం అందడానికి ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు చాలా ఏళ్ల నుంచి డిమాండ్ చేస్తున్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం మూడేళ్ల క్రితం అచ్యుతాపురానికి ఈఎస్ఐ ఆస్పత్రిని మంజూరు చేసింది. భూమి, ఇతర మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించాల్సి వుండడంతో గత ప్రభుత్వం ఏపీఐఐసీ నుంచి రెండు ఎకరాలను 33 ఏళ్లపాటు లీజుకు తీసుకుంది. కానీ అస్పత్రి నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2024 అక్టోబరు 29న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈఎస్ఐ ఆస్పత్రి భవన నిర్మాణానికి వర్చువల్‌గా శంకుస్థాపన ... మిగతా 6వ పేజీలో

యువతి మౌనపోరాటం

పెళ్లి చేసుకుంటానని నమ్మించిన యువకుడు

- శారీరకంగా కలవడంతో బిడ్డకు జన్మనిచ్చిన యువతి
- అప్పటి నుంచి మొహం చాటేసిన వైనం
- పసిబిడ్డతో గాంధీగ్రామంలో అతని ఇంటి ఎదుట ఆందోళన



గాంధీగ్రామంలో యువకుడి ఇంటి ఎదుట పసిబిడ్డతో కూర్చున్న యువతి నూకరత్నం

చోడవరం, మార్చి2 (ఆంధ్రజ్యోతి): **భర్త అకాల మరణంతో ఆమె ఒంటరి అయ్యింది. నువ్వంటే ఇష్టం, పెళ్లి చేసుకుని అండగా ఉంటానని ఓ యువకుడు నమ్మించాడు. శారీరకంగా లోబరుచుకుని, బిడ్డ పుట్టిన తరువాత ముఖం చాటేశాడు. దీంతో ఆమె ఆదివారం ఆ యువకుడి ఇంటి ఎదుట మౌనపోరాటానికి దిగింది. ఇందుకు సంబంధించి ఆమె తెలిపిన వివరాలిలా వున్నాయి.**

చోడవరం పట్టణంలోని గాంధీగ్రామం సిటిజన్ కాలనీకి చెందిన మొల్లి నూకరత్నం భర్త కొంతకాలం క్రితం చనిపోయాడు. అప్పటికి వీరికి పిల్లలు కలగలేదు. భర్త చనిపోయిన తరువాత ఆమె స్థానికంగా ఒక బట్టల దుకాణంలో సేల్స్‌గర్ల్‌గా పనిచేస్తున్నది. ఈ దుకాణానికి ఎదురుగా కొమ్మోజు సతీశ్ అనే యువకుడు బైక్ మెకానిక్ షాపు నడుపుతున్నాడు. మూడేళ్ల క్రితం నూకరత్నంతో పరిచయం ఏర్పరచుకుని, ప్రేమిస్తున్నానని చెప్పాడు. కొంతకాలం తరువాత అతని మాటలు నమ్మి, ఆమె కూడా ప్రేమించడం మొదలు పెట్టింది. పెళ్లి చేసుకుంటానని చెప్పి లక్ష్మీపురంలో ఒక ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. ఆ ఇంట్లోనే మూడుముళ్లు వేసి పెళ్లి చేసుకున్నట్టు చెప్పాడు. అనంతరం కాపురం కూడా చేయడంతో నూకరత్నం గర్భం దాల్చింది. తరువాత ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆస్పత్రిలో ప్రసవం సందర్భంగా బిడ్డ తండ్రిగా సతీశ్ పేరు నమోదు చేయాలని ఆమె కోరగా, అప్పటినుంచి ముఖం చాటేశాడు. ఈ విషయాన్ని పెద్దల దృష్టికి తీసుకెళ్లగా, నూకరత్నంతో కాపురం చేసేందుకు అతను అంగీకరించలేదు. దీంతో తనకు న్యాయం చేయాలంటూ ఆదివారం ఉదయం బిడ్డతో సహా గాంధీగ్రామంలో సతీశ్ ఇంటి ఎదుట మౌన పోరాటానికి ... మిగతా 6వ పేజీలో

ఎడాపెడా జరిమానాలు

అమల్లోకి కొత్త మోటారు వాహన చట్టం

- హెల్మెట్, సీటుబెల్టు లేకుంటే మూల్యం తప్పదు
- ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న వ్యక్తికీ హెల్మెట్ తప్పనిసరి
- వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ మాట్లాడితే రూ.1,500 ఫైన్
- రెండోసారి పట్టుబడితే రూ.10 వేలు జరిమానా
- రవాణా వాహనాల్లో పరిమితికి మించి లోడు వేస్తే రూ.20 వేలు..
- లైసెన్స్ లేకుండా డ్రైవింగ్, మైనర్ల డ్రైవింగ్, రాంగ్ రూట్‌లో వాహనాలు నడపడం.. వగైరా వాటికి కూడా భారీగా ఫైన్‌లు

అనకాపల్లి రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): **కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన నూతన మోటారు వాహన చట్టాన్ని ఈ నెల ఒకటో తేదీ నుంచి పోలీసులు, రవాణా శాఖ అధికారులు అమలు చేస్తున్నారు. కొత్త చట్టంలో ట్రాఫిక్ ఉల్లంఘనలకు జరిమానాలను భారీగా పెంచేశారు. ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తి హెల్మెట్ పెట్టుకోకపోతే రూ.వెయ్యి జరిమానా విధిస్తారు. రెండోసారి పట్టుబడితే రూ.2 వేలు చెల్లించాల్సి ఉంటుంది. వాహనం నడిపే వ్యక్తికి డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే రూ.వెయ్యి జరిమానా విధిస్తారు. రెండోసారి పట్టుబడితే రూ.ఐదు ఫైన్ వేస్తారు. మైనర్ల డ్రైవింగ్, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం, కారు నడిపేవారు, పక్క సీట్లో కూర్చునే వారు సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడం, మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం వంటి వాటికి కూడా జరిమానాలను భారీగానే పెంచారు.**

మోటారు వాహన చట్టం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారికి ముగుతాడు వేసేందుకు రవాణా, పోలీసు శాఖల అధికారులు స్పెషల్ డ్రైవ్‌లు పెట్టి జరిమానాలు విధిస్తున్నా సరే కొంతమంది వాహన చోదకుల ధోరణి మార్చుకోవడం లేదు. నామమాత్రపు జరిమానాలు విధిస్తుండడంతో నిబంధనలను బేఖాతరు చేసేస్తున్నారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించేలా కేంద్రం నూతన మోటారు వాహన చట్టం (ఎంవీ యాక్ట్ 2019) రూపొందించింది. నిబంధనలు పాటించని వారికి జరిమానాలను భారీగా పెంచింది. అలాగే విధించిన జరిమానాలను కచ్చితంగా 90 రోజుల్లోగా చెల్లించాలని నిబంధన విధించింది. ఒక తప్పును పదేపదే చేస్తే జరిమానా మొత్తాన్ని మరింత పెంచేసేంది. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన నూతన మోటారు వాహన చట్టాన్ని అమలు చేసేందుకు రాష్ట్రం ప్రభుత్వం కూడా సిద్ధమైంది. ఈ నెల ఒకటి నుంచి అమల్లోకి తీసుకువచ్చింది. ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితోపాటు వెనుక కూర్చొనే వ్యక్తి కూడా విధిగా హెల్మెట్ పెట్టుకోవాలి. వాహనం నడిపే వ్యక్తి హెల్మెట్ పెట్టుకోకపోతే సెక్షన్ 194 (బి) ప్రకారం ఇప్పటివరకు రూ.వెయ్యి జరిమానా విధించగా, ఇకపై కూడా రూ.వెయ్యి మాత్రమే విధిస్తారు. రెండోసారి పట్టుబడితే రూ.2 వేలు చెల్లించాల్సి ఉంటుంది. వాహనం వెనుక కూర్చొనే వ్యక్తి హెల్మెట్ పెట్టుకోకపోతే రూ.వెయ్యి జరిమానా విధిస్తారు. రెండోసారి అదే వ్యక్తి ఎక్కడైనా పట్టుబడితే రూ.2 వేలు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే సెక్షన్ 181 ప్రకారం రూ.వెయ్యి జరిమానా విధిస్తారు. రెండోసారి పట్టుబడితే రూ.ఐదు వేలు కట్టాల్సి ఉంటుంది. మైనర్‌లు వాహనం నడిపితే ఇప్పటివరకు రూ.500 జరిమానా విధిస్తున్నారు. దీనిని రూ.5 వేలకు పెంచారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే సెక్షన్ 184 ప్రకారం ప్రస్తుతం రూ.వెయ్యి జరిమానా విధిస్తుండగా, దీనిని రూ.1,500కు పెంచారు. ఇదే తప్పు రెండోసారి చేస్తూ పట్టుబడితే రూ.10 వేలు ఫైన్ వేస్తారు. యూనిఫారం లేని ఆటో డ్రైవర్లకు రూ.300 జరిమానా విధిస్తారు. వాహనాన్ని మితిమీరిన వేగంతో నడిపితే రూ.వెయ్యి జరిమానా విధించనున్నారు. బైక్ రేసింగ్‌లకు పాల్పడే వారికి ప్రస్తుతం విధిస్తున్న రూ.వెయ్యి జరిమానాను రూ.5 వేలకు పెంచారు. రెండోసారి ... మిగతా 6వ పేజీలో



అనకాపల్లిలో హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలను నడుపుతున్న వారికి జరిమానాలు విధిస్తున్న పోలీసులు

ముురుగెత్తిన రోడ్లు

దేమునిగుమ్మం జంక్షన్ - నూకాంబిక ఆలయ మార్గంలో పొంగిన డ్రైనేజీ

- కాలువల్లో చెత్తాచెదారం తొలగించకపోవడంతో సమస్య
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడిన స్థానికులు

అనకాపల్లి టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ కాలువల నిర్వహణ అధ్వానంగా వుంది. కాలువల్లో ఎప్పటికప్పుడు పూడిక తీయకపోవం, చెత్తాచెదారాన్ని తొలగించకపోవడంతో మురుగునీటి సరఫరాకు ఆటంకం ఏర్పడి, రహదారులపైకి ప్రవహిస్తున్నది. స్థానిక దేమునిగుమ్మం జంక్షన్ నుంచి నూకాంబిక ఆలయానికి వెళ్లే రహదారిలోని పాత జగన్నాథ థియేటర్ వెనుక రోడ్డులో ఆదివారం ఇదే పరిస్థితి నెలకొంది. కాలువలు చెత్తతో నిండిపోవడంతో మురుగునీరు రోడ్డుపైకి వచ్చింది. ఇక్కడ కొంత పల్లంగా వుండడంతో మురుగునీరు నిలిచిపోయి రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ మార్గంలో డ్రైనేజీ కాలువలు చిన్నవి కావడం, రోడ్డుకు సమాంతరంగా ఉండడంతో ముగురునీటి ప్రవాహం కొద్దిగా పెరిగినా.. రోడ్డుపైకి పొర్లుతున్నది. ఈ మార్గంలో విద్యా సంస్థలు, కల్యాణ మండపాలు, ఇండోర్ స్టేడియం, నివాసాలు వున్నాయి. ఇంకా దేమునిగుమ్మం జంక్షన్ నుంచి నూకాంబిక అమ్మవారి ఆలయానికి భక్తులు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. ఆదివారం కావడం వల్ల నూకాంబిక ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. వీరింతా ఇబ్బందులు పడ్డారు. గత ఏడాది డిసెంబరులో ఇక్కడ మురుగు నీరు దాదాపు వారం రోజులపాటు రోడ్లను ముంచెత్తింది. ఈ సమయంలో పర్యటించిన నాటి జీవీఎంసీ కమిషనర్.. స్థానిక అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. కొంతకాలం తరువాత సమస్య మళ్లీ తలెత్తింది. జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు స్పందించి పాత జగన్నాథ థియేటర్ వెనుక రోడ్డులో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



1) మురుగునీటితో చెరువును తలపిస్తున్న నూకాంబిక ఆలయానికి వెళ్లే రోడ్డు
2) రహదారికి సమాంతరంగా ప్రవహిస్తున్న మురుగు కాలువ
3) డ్రైనేజీ పొంగి.. రోడ్డుపైకి వస్తున్న మురుగు నీరు

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సోమ) 6.08
సహరి (మంగళ) 4.59

అత్యాచారం చేసిన వ్యక్తిపై పోక్సో కేసు

రాంబిల్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం చేసిన కేసులో మండలంలోని కృష్ణంపాలెం గ్రామానికి చెందిన లాలం రామదాస్ (33)పై ఆదివారం పోక్సో కేసు నమోదు చేసినట్టు రాంబిల్లి సీఐ నరసింగరావు తెలిపారు. తన కుమార్తెను లాలం రామదాస్ అత్యాచారం చేశాడని బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్టు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ నరసింగరావు తెలిపారు.

నూకాంబిక అమ్మవారి ఆలయ నిర్మాణ కరపత్రం విడుదల

ఎలమంచిలి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని మూడో వార్డు తెరువుపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠ కరపత్రాన్ని ఆదివారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నేత జయరామ్, పలువురు నేతలు పాల్గొన్నారు.

ఘనంగా రజకుల బల్లల జాతర

ఎస్.రాయవరం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రజకులు ఆదివారం బల్లల జాతరను ఘనంగా నిర్వహించారు. ముందుగా రజకులందరూ తమ కుటుంబ సభ్యులు, బంధులతో కలిసి గ్రామంలోని పుర వీధిల్లో శక్తి వేషాలు, నేల డాన్సుల నడుమ సందడి చేస్తూ ఊరేగింపుగా వారు బట్టలు ఉతికే ప్రదేశం వద్దకు తరలివెల్లి అక్కడ పూజలు చేశారు. అనంతరం ఆ ప్రదేశంలో తీర్థం నిర్వహించారు.

గురువుల విజేత ఎవరో!

... 5వ పేజీ తరువాయి

ఏజెంట్ పాసులు జారీ చేశారు.

గెలుపుపై ముగ్గురు అభ్యర్థుల్లోనూ ధీమా

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పది మంది పోటీచేశారు. వీరిలో సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, కోరెడ్ల విజయగౌరి మధ్యే ప్రధాన పోటీ నెలకొందని ఎన్నికల విశ్లేషకులు చెబుతున్నారు. గెలుపుపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. రఘువర్మకు కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యులైన టీడీపీ, జనసేన పార్టీలు, గాదె శ్రీనివాసులనాయుడుకి బీజేపీలో వుండే ఆర్ఎస్ఎస్‌కు చెందిన కొందరు నాయకులు మద్దతు పలికారు. విజయగౌరి మద్దతుగా సీపీఎంతోపాటు కొన్ని వామపక్షాలు పనిచేశాయి.

వచ్చేస్తోంది ఈఎస్ఐ ఆస్పత్రి

... 5వ పేజీ తరువాయి

చేశారు. రూ.62.21 కోట్లుతో 30 పడకల ఆస్పత్రితోపాటు 16 నివాస గృహసముదాయాలను నిర్మిస్తారు. నిర్మాణ బాధ్యతలను సీపీడబ్ల్యూడీకి ప్రభుత్వం అప్పగించింది. గత ఏడాది నవంబరులో పనులు ప్రారంభించారు. 18 నెలల్లో.. అంటే వచ్చే ఏడాది ఏప్రిల్‌నాటి పూర్తిచేయాలి. ఈఎస్ఐ ఆస్పత్రి అందుబాటులోకి వస్తే సర్జరీ, గైనికాలజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, ఎనస్థీషియా వంటి వైద్య నిపుణులు సేవలు అందుతాయి. రోగాలకు అవసరమైన మందులు కూడా ఉంటాయి. పది మంది అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులు పనిచేసే కర్మాగారాలు, కంపెనీల్లో నెలకు రూ.21 వేలు, అంతకన్నా తక్కువ వేతనాలు పొందుతున్న కార్మికులు/ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చు. అచ్యుతాపురం సెజ్‌కు 25 కిలోమీటర్ల పరిధిలో ప్రస్తుతం వున్న 600 కంపెనీలు, కర్మాగారాల్లో పనిచేస్తున్న సుమారు 37 వేల మంది కార్మికులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయం అందుతుంది. భవిష్యత్తులో ఏర్పాటు కానున్న కంపెనీలు, ఫ్యాక్టరీల్లో చేరే వారికి కూడా ఈ సదుపాయానికి అర్హులవుతారు.

యువతి మౌనపోరాటం

... 5వ పేజీ తరువాయి

దిగింది. ఈ సందర్భంగా నూకరత్నం మీడియాతో మాట్లాడుతూ, సతీశ్‌కు గతంలోనే పెళ్లయ్యిందని, కానీ ఈ విషయం దాచిపెట్టి తనను పెళ్లి చేసుకున్నాడని, బిడ్డ పుట్టిన దగ్గర నుంచి దూరంగా వుంటున్నాడని చెప్పింది. అతనిపై అనకాపల్లి దిశ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ హాజరుకాకుండా తిరుగుతున్నాడని ఆరోపిం చింది. గత్యంతరం లేని స్థితిలో బిడ్డతో కలిసి న్యాయం కోసం ఆందోళనకు దిగాల్సి వచ్చిందని చెప్పింది. కాగా సతీశ్ ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న నూకరత్నంను మాజీ ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, గాంధీ గ్రామం, నరసయ్యపేట సర్పంచ్‌లు గాడి అప్పారావు, ఉగ్గిన నాగబాబు, వైసీపీ నాయకులు శ్రీకాంత్, బైన ఈశ్వరరావు తదితరులు పరామర్శించారు. నూకరత్నంకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఎడాపెడా జరిమానాలు

... 5వ పేజీ తరువాయి

పట్టుబడితే వారికి రూ.10 వేలు జరిమానా విధిస్తారు. సీటు బెల్టు ధరించకుండా కారు నడిపితే సెక్షన్ 194 బి (1) ప్రకారం నడిసపే వ్యక్తికి రూ.వెయ్యి, డ్రైవర్ పక్కన కూర్చున్న ప్రయాణికుడికి రూ.వెయ్యి జరిమాన విధిస్తారు. వాహనం రిజిస్ట్రేషన్ లేదా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేదా రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేయించకుండా వాహనం రోడ్డుమీద తిరిగితే మొదటిసారి రూ.2, రెండోసారి పట్టుబడితే రూ.5 వేలు జరిమానా వుంటుంది. ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణిస్తే సెక్షన్ 194 సీ ప్రకారం రూ.1,000 జరిమానా చెల్లించాల్సి వుంటుంది. రవాణా వాహనాలు ఓవర్‌లోడ్‌తో పట్టుబడితే ఇంతవరకు రూ.వెయ్యి జరిమానా వుండగా, దీనిని ఏకంగా రూ.20 వేలకు పెంచారు. ప్రతి అదనపు టన్నుకి రూ.2 వేల చొప్పున చెల్లించాల్సి వుంటుంది. 108తోపాటు ఇతర అత్యవసర వాహనాలకు దారి ఇవ్వకుండా ఆటంకం కలిగిస్తే రూ.10 వేలు జరిమానా విధిస్తారు. వాహనానికి ఇన్సూరెన్స్ లేకపోతే 196ఏ సెక్షన్ ప్రకారం రూ.2 వేలు కట్టాల్సి ఉంటుంది. రెండోసారి పట్టుబడితే రూ.4 వేలు జరిమానా చెల్లించాలి. రాంగ్ రూట్‌లో వాహనాలను నడపడం, సిగ్నల్ జంపింగ్ వంటి ఉల్లంఘనలకు రూ.2 వేలు ఫైన్ విధిస్తారు. కాగా నూతన మోటారు వాహన చట్టాన్ని పోలీసు, రవాణా శాఖల అధికారులు శనివారం నుంచి అమలు చేస్తున్నారు. అనకాపల్లి ట్రాఫిక్ సీఐ వెంకటరావు ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న లారీకి రూ.60 వేలు జరిమానా విధించారు.

గృహమే పాఠశాల

- టెన్త్ విద్యార్థులకు స్టడీ అవర్
- దగ్గరుండి చదివిస్తున్న మాస్టారు
- ఆపై పోషకాహారం కూడా..
- చినదొడ్డిగల్లు టీచర్ వెంకటరమణ ఆదర్శం

నక్కపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలం చినదొడ్డిగల్లు జడ్పీ హైస్కూల్‌లో ఆంగ్ల ఉపాధ్యాయుడు వై.వెంకటరమణ పాఠశాలలో విధులు పూర్తయిన తరువాత కూడా విద్యార్థుల కోసం పనిచేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మార్చిలో టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. చినదొడ్డిగల్లులోని తన నివాసం వద్దే ఆగ్రామానికి చెందిన 20 మంది విద్యార్థులకు రోజూ స్టడీ అవర్ నిర్వహిస్తున్నారు. జనవరి నుంచి ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ వెంకటరమణ తన ఇంటి వద్దే పిల్లలకు స్టడీ అవర్ నిర్వహిస్తున్నారు. ఇంగ్లీష్ సబ్జెక్టు సహా ఇతర సబ్జెక్టులను కూడా పిల్లలు చదువుకునే సదుపాయం కల్పించారు.

వారికి స్టడీ అవర్‌లో పోషక పదార్థాలను కూడా అందజేస్తున్నారు. తన గృహాన్నే పాఠశాలగా వెంకటరమణ మార్చి పిల్లలకు శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా వెంకటరమణ సేవలు, కృషిని అభినందిస్తున్నారు. ప్రశాంతంగా, ఒత్తిడి లేకుండా పరీక్షలు ఎలా రాయాలో కూడా మాస్టారు పిల్లలకు నేర్పిస్తున్నారు.



ఇంటి వద్ద టెన్త్ పిల్లలకు స్టడీ అవర్ నిర్వహిస్తున్న వెంకట రమణ మాస్టారు

మాకు చాలా ఇంట్రస్ట్‌గా వుంది

కె.బాల, టెన్త్ విద్యార్థిని



రోజూ రాత్రి వేళ మా మాస్టారు ఇంటి వద్ద నిర్వహిస్తున్న స్టడీ అవర్‌కు వెళుతున్నాం. మేమంతా ఎంతో ఉత్సాహంగా, పోటీపడి చదువుకుంటున్నాం. ఆంగ్లంలోనే గాకుండా ఇతర సబ్జెక్టులపై కూడా శ్రద్ధ పెట్టి చదువుకుంటున్నాం. టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించగలమన్న నమ్మకం వుంది. మా మాస్టారుకు రుణపడి వుంటాం.

నూరుశాతం ఫలితాలే లక్ష్యం

ఆంగ్ల ఉపాధ్యాయుడు, వెంకట రమణ



చినదొడ్డిగల్లు హైస్కూల్‌లో టెన్త్ చదువుతున్న విద్యార్థులంతా నూరుశాతం ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నాం. మా గ్రామంలో వున్న టెన్త్ పిల్లల కోసం ఇంటి వద్దే స్టడీ అవర్ నిర్వహిస్తున్నాను. పిల్లలు కూడా చాలా హుషారుగా వున్నారు. వారికి ప్రత్యేక సూచనలిస్తున్నాను. వారి తల్లిదండ్రుల సహకారం కూడా బాగుంది.

ఆయకట్టు అభివృద్ధికి ఏషియన్ పెయింట్స్ సీఎస్ఆర్ నిధులు

- రూ.15 లక్షలతో గేట్ల మరమ్మతులు
- 350 ఎకరాల సాగుకు నీరందించేందుకు ఏర్పాట్లు

అచ్యుతాపురం మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సెజ్‌లోని ఏషియన్ పెయింట్స్ సీఎస్ఆర్ నిధులతో ఎంజేపురం పరిధిలో గల మెలిపాక గెడ్డ పరిధిలోని సాగురైతులకు నీరందించే పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ పనులకు రూ. 15 లక్షలు ఖర్చవుతుందని అంచనా వేశారు. మండలంలోని జగ్గన్నపేట నుంచి మేజర్ శారదా నది వరకు గల 358 ఎకరాల్లో 453 మంది రైతులు సాగు చేస్తున్నారు. ఈ మధ్యలో గోవింద దుర్గ గేటు, కోడి కాలువ, రశీదు గట్టు, పుంజేరు గట్టులో రెగ్యులేటర్లున్నాయి వీటి మధ్యలో తొమ్మిది గేట్లున్నాయి. గేట్లు పాడైపోవడంతో సాగు నీరు సక్రమంగా అందడం లేదు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో రైతులు ఎన్ని అర్జీలు పెట్టినా ఫలితం లేకపోయింది. గేట్లు పాడైపోవడంతో పొలాలకు నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మెలిపాక గెడ్డపై ఉన్న రెగ్యులేటర్లతోపాటు మధ్యలో ఉన్న తొమ్మిది గేట్లకు మరమ్మతులు చేయించేందుకు ఏషియన్ పెయింట్స్ ముందుకొచ్చింది. ఈపనులను ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మెలిపాక గెడ్డ నీటిసంఘం అధ్యక్షుడు వీసం సత్యారావు అ



ఎంజేపురం రశీదు గట్టుపై పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

లియాస్ నానాజీ, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ మహేంద్ర వద్వాని, ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ అనిల్ కుమార్, ఫీల్డ్ ఫెసిలిటేటర్ జి. అప్పలరాజు, గౌతు రాంబాబు, సేనాపతి వెంకటేష్, భీముని ఆదినారాయణ, పుల్లింగల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మిల్లెట్ మేళాకు తరలిన 'పేట' రైతులు

పాయకరావుపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మిల్లెట్ కిసాన్ మేళా, ఇండస్ట్రీ ఎగ్జిబిషన్‌కి పాయకరావుపేట నుంచి తాండవ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో పలువురు రైతులు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా సంస్థ సీఈఓ జీవీ.సత్యనారాయణ మాట్లాడుతూ హైదరాబాద్‌లోని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో సోమ,మంగళవారాల్లో నిర్వహించనున్న ఎగ్జిబిషన్‌లో శాస్త్రీయ సాగు, జీవ వైవిధ్య పరిరక్షణ, పోషకాహార విలువలతో కూడిన చిరుధాన్యాల ఉత్పత్తులు, ప్రాసెసింగ్, మార్కెటింగ్ తదితర అంశాలపై ఔత్సాహిక రైతులకు అవగాహన కల్పిస్తారన్నారు. ఈ ఎగ్జిబిషన్‌కి ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల నుంచి ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ (రైతు సంఘాలు)కి చెందిన 4వేల మంది రైతులు పాల్గొంటున్నారన్నారు. ఈ ఎగ్జిబిషన్‌కి పాయకరావుపేట నుంచి 40 మంది రైతులు హాజరవుతున్నారన్నారు.



పాయకరావుపేట నుంచి హైదరాబాద్‌కి బయలుదేరుతున్న రైతులు

మహిళా పోలీసులకు క్రీడా పోటీలు

అచ్యుతాపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాలు సందర్భంగా ఆదివారం మహిళా కానిస్టేబుళ్లకు క్రీడల పోటీలు నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్స్‌లో పోటీలు నిర్వహించామని ఎస్ఐ సుధాకర్ తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని ఆయన తెలిపారు.



కబడ్డీ ఆడుతున్న మహిళా పోలీసులు

భవన నిర్మాణ కార్మికులకు ఆర్థిక సాయం

అచ్యుతాపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వృత్తిలో గాయపడిన భవన నిర్మాణ కార్మికులకు ఆర్థిక సహాయం చేశామని మణికంఠ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు రాజాన అప్పలనాయుడు తెలిపారు. విధినిర్వహణలో పరంజి మీద నుంచి పడిపోయి తీవ్రంగా గాయపడిన కె. అప్పారావు, అనారోగ్యం పాలైన పి. కన్నయ్యకు రూ.ఆరు వేలు చొప్పున సంఘం తరపున ఆదివారం అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము, కె. సోమునాయుడు, చింతకాయల శివాజీ తదితరులు పాల్గొన్నారు. 2ఎస్ఆర్‌వీఎం2 అడ్డరోడ్డులో ప్రారంభించిన శాంతి రథంతో సీఐ రామకృష్ణ, ఎస్ఐ విభీషణరావు తదితరులు

మానవత సంస్థ సేవలు భేష్ : సీఐ రామకృష్ణ

ఎస్.రాయవరం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు ఆదర్శంగా నిలుస్తాయని ఎస్.రాయవరం సర్కిల్ సీఐ రామకృష్ణ అన్నారు. మండలంలోని అడ్డరోడ్డులో మానవత స్వచ్ఛంద సంస్థ సమకూర్చిన నూతన శాంతి రథం, ఫ్రీజర్ బాక్స్‌లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉచిత సేవలందించేందుకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మంచి నిర్ణయం తీసుకుందన్నారు. ఇటువంటి చక్కని సేవా కార్యక్రమాలు చేపడుతున్న సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డిని సీఐ అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఐ విభీషణరావు, సంస్థ సభ్యురాలు కోడూరి రాధాపుష్పలత, సంస్థ అడ్డరోడ్డు ఏరియా శాఖ చైర్మన్ యేజెర్ల వినోద్‌రాజు, అధ్యక్షుడు దాట్ల రాజన్‌రాజు, ఉపాధ్యక్షులు వెంకటరమణ, కార్యదర్శి కోరపాటి గోపాలం, కోశాధికారి ఆనంతరావు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



శాంతి రథాన్ని ప్రారంభిస్తున్న సీఐ రామకృష్ణ

కోడిపందేలపై దాడి : ముగ్గురి అరెస్టు

కోటవురట్ల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారు గవరపేటలో కోడి పందేలు ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను ఆదివారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ రమేష్ తెలిపారు. గవరపేట శివారులో కోడిపందేలు ఆడుతున్నట్టు ముందస్తు సమాచారంతో అందడంతో ఎస్ఐ రమేష్ సిబ్బందితో కలిసి దాడి చేసి ముగ్గురు వ్యక్తులు అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి మూడు కోడిపుంజులను, రూ.1050 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదుచేసిట్టు ఆయన తెలిపారు.



కోడిపందేలు ఆడిన వారితో పోలీసులు

మాదిగ అమర వీరులకు ఘన నివాళి



అమరవీరులకు నివాళి అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కోటవురట్ల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మాదిగ అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని స్థానిక విజ్ఞాన్ సమతా ప్రాంగణంలో ఎస్సీల వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరులకు ఎంఆర్‌పీఎస్ నేతలు, నాయకులు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంటేడ అప్పారావు, క్లబ్ ప్రధాన సలహాదారుడు కోడి కొండలరావు, ఎమ్మార్పీఎస్ నాయకులు పెదపూడి చంటి గోరింట్ల అప్పారావు, మునగాడ పరశురాం, గంటేడ చిరంజీవి, నరేంద్ర, కాండ్రకోట నరేష్, గంటేడ రమణకుమార్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

పాయకరావుపేట, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : స్థానిక వికాస తరంగిణి ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం పట్టణంలో మహిళల కోసం ప్రత్యేకంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక పీఆర్ గెస్టుహౌస్‌లో నిర్వహించిన ఈ శిబిరంలో పాల్గొన్న డాక్టర్ అనంతలక్ష్మి, పుష్ప పలువురు మహిళలకు గర్భాశయ, రొమ్ము క్యాన్సర్‌కి సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వికాస తరంగిణి సభ్యురాలు ఆండాళ్ రిందాదేవి మాట్లాడుతూ వివాహమైన ప్రతి మహిళ ఏడాదికి ఒకసారి గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఇప్పటివరకు 1,440 ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించినట్టు చెప్పారు. కార్యక్రమంలో వికాస తరంగిణి సభ్యులు వెంకటలక్ష్మీ, శైలజ, సూర్య, రాణి, దేవి, రాధ తదితరులు పాల్గొన్నారు.



మహిళకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పేటలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

పాయకరావుపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక హైమా నేత్రాలయం సహకారంతో బిగ్ టీవీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆనంద్‌నగర్‌లో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్ వైద్య శిబిరాన్ని ప్రారంభించగా హైమా నేత్రాలయం అధినేత డాక్టర్ పీఎస్ఆర్.ప్రసాద్ 120 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గూటూరు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు మలిపెద్ది వెంకటరమణ, దొంగబాబు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడి ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం

మునగపాక, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సుమారు రూ.5కోట్లు అంచనా వ్యయంతో నిర్మిస్తున్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం ఉమ్మలాడ గ్రామానికి చెందిన మొల్లేటి వాసు రూ.2లక్షలు విరాళం ఇచ్చారు. కమిటీ పెద్దలు బొడ్డేడ ప్రసాద్, కాండ్రేగుల జగ్గారావు, దాడి ముసిలినాయుడు తదితరులకు విరాళాన్ని అందజేశారు.



కమిటీ సభ్యులకు విరాళం అందజేసిన వాసు

పట్టణంలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్టులు



బెల్ట్ గ్రేడింగ్ పరీక్షల్లో గెలుపొందిన వారికి బెల్ట్, ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేసిన నిర్వాహకులు

ఎలమంచిలి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలో పలువురు క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచారు. స్థానిక వాగ్దేవి కళాశాల ఆవరణలో ఫొటోకాన్ ఇండియా కరాటే డో అసోసియేషన్ ఏపీ చీఫ్ సెన్సాయి పి.నరసింహారావు, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ జి. శివరామకృష్ణ పర్యవేక్షణలో సీనియర్ కరాటే మాస్టర్ నక్కా వెంకట్రామన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సెమినార్ బెల్ట్ గ్రేడింగ్ పరీక్షల్లో క్రీడాకారులు రెండున్నర గంటలపాటు శ్రమించి ప్రతిభను కనబరిచారు. అనంతరం పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన వారికి సెన్సాయి పి.నరసింహారావు బెల్ట్‌లు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత సైనికోద్యోగి నక్కా శివశంకర్, వాగ్దేవి కళాశాల ప్రతినిధి అడపా శేషగిరిరావు, దాడి రమేష్, పి. పృధ్వీరాజ్, పి. రమేష్, కె.శ్రీను, కేవీ.శ్యామ్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'అధిక ధరకు హెరిటేజ్ పాలు కొనుగోలు'

అచ్యుతాపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా తమ డెయిరీ పనిచేస్తోందని హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు అన్నారు. ఆదివారం దుప్పితూరులో హెరిటేజ్ పాలసేకరణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిగతా డెయిరీల కన్నా రైతుల నుంచి అధిక ధరలకు పాలను కొనుగోలు చేస్తున్నామన్నారు. అలాగే పాడి పశువులతోపాటు వాటిని సాకే రైతులకు కూడా బీమా సౌకర్యాన్ని వర్తిస్తున్నామన్నారు. అలాగే పశువుల గర్భోత్పత్తికి అవసరమైన ఇంజక్షన్‌లను ఉచితంగా చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో నూకరాజు, సంతోష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవికి సుందరపు దంపతుల పూజలు

అచ్యుతాపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): విశాఖ కైలాసగిరి వద్ద గల అన్నపూర్ణాదేవిని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా అమ్మవారికి అభిషేకంతోపాటు విశేష పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలతోపాటు అమ్మవారి జ్ఞాపికలను సుందరపు దంపతులకు బహూకరించారు.



అన్నపూర్ణాదేవికి పూజలు చేస్తున్న సుందరపు దంపతులు

ఎంజేపురం హైస్కూల్ ప్రహరీకి శంకుస్థాపన



ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన గ్రామ పెద్దలు

అచ్యుతాపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంజేపురం ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణానికి నాయకులు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఇక్కడ విద్యార్థులు అధికంగా ఉండడంతో అదనంగా రెండు భవనాలు నిర్మించారు. కొత్తగా నిర్మించిన భవనాలకు ప్రహరీ లేకపోవడంతో 390 మీటర్ల పొడవున ప్రహరీ నిర్మాణానికి రూ.35 లక్షలు జడ్పీ నిధులు మంజూరు చేశారు. ఆదివారం ఈ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కరెడ్ల సూర్యప్రకాష్, సెనాపతి వెంకటేష్, గౌతు రాంబాబు, వీసం నానాజీ తదితరులు పాల్గొన్నారు.

పెదపల్లిలో సారా నిర్మూలనపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ తేజో వెంకటకుమార్

ఎలమంచిలి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పెదపల్లిలో సారా నిర్మూలన, మత్తు పదార్థాల వల్ల అనర్థాల గురించి ఎక్సైజ్ అధికారులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు వారు పలు సూచనలు చేశారు. మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదని, జీవితాలను నాశనం చేసుకోవద్దని వివరించారు ఎక్సైజ్ సీఐ తేజోవెంకట కుమార్, స్థానికులు దాసరి కుమార్, యువత పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణకు మునిసిపల్ అధికారుల దాడులు

ఎలమంచిలి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో నిషేధిత ప్లాస్టిక్ వస్తు సామగ్రి నియంత్రణ కోసం ఆదివారం మునిసిపల్ అధికారులు పలు దుకాణ సముదాయాల్లో దాడులు నిర్వహించారు. కమిషనర్ ప్రసాదరాజు పర్యవేక్షణలో ప్రజారోగ్య శాఖ అధికారి పల్లా శ్రీనివాసరావు, సిబ్బందితో కలిసి మార్కెట్లో దాడి చేసి 15 కిలోల ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్నారు. వ్యాపారస్తులంతా ప్లాస్టిక్ నియంత్రణకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. నిబంధనలు కాదని విక్రయించినా.. వినియోగించినా.. చర్యలు తీసుకోవడం జరుగుతుందని వ్యాపారులను హెచ్చరించారు.



దుకాణాల్లో దాడులు నిర్వహిస్తున్న మునిసిపల్ సిబ్బంది

వైభవంగా కాశీ విశాలాక్షి కల్యాణోత్సవం

మునగపాక, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశాలాక్షి సహిత కాశీ విశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్ సూరిశెట్టి రాము పర్యవేక్షణలో జరిగిన వేడుకల్లో బొడ్డేడ ప్రసాద్, కోనపల్లి రామ్మోహన్‌రావు, ఆడారి కాశిబాబు, వేగి లక్ష్మణరావు, తేలి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

మిక్స్‌డ్ సాల్వెంట్స్ డ్రమ్ములు స్వాధీనం

అచ్యుతాపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ చేసిన మిక్స్‌డ్ సాల్వెంట్స్‌ని స్వాధీనం చేసుకొని ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. సెజ్ కర్మాగారాల్లో వినియోగానంతరం సాల్వెంట్స్‌ని సెజ్ కాలనీలో మోటూరు మణికంఠ డ్రమ్ముల్లో నిల్వ చేస్తున్నారన్న సమాచారం అందడంతో దాడి చేసి 61 డ్రమ్ముల్లో 8 వేల లీటర్ల సాల్వెంట్స్‌ని స్వాధీనం చేసుకున్నామన్నారు. మండే గుణమున్న ఈ సాల్వెంట్స్‌ని లైసెన్స్ పొందిన వ్యక్తులు మాత్రమే క్రయవిక్రయాలు జరపాలన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా దీనిని నిల్వ చేసిన మణికంఠను అరెస్టు చేసినట్టు ఆయన తెలిపారు.

చెట్టుపై నుంచి జారిపడి ఒకరి మృతి


మృతి చెందిన శేఖర్

గొలుగొండ, మార్చి2 (ఆంధ్రజ్యోతి): చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఒకరు మృతి చెందినట్టు ఎస్‌ఐ రామారావు ఆదివారం తెలిపారు. ఎస్‌ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. జి.మాడుగుల మండలం గడుతూరు గ్రామానికి చెందిన గెమ్మిలి శేఖర్(29) అనే వ్యక్తి మండలంలోని సీతకండి గ్రామంలో ఉన్న చిన్నాన్న ఇంటికి కూలి పనులపై వచ్చాడు. శనివారం సాయంత్రం పక్క గ్రామమైన ముంగర్లపాలెంలో చింతకాయలు కోయడానికి చింతచెట్టు ఎక్కాడు. చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. వెంటనే నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేసినట్టు చెప్పారు.

నర్సీపట్నంలో రాక్షస పాలన

»» మాజీ ఎమ్మెల్యే పెట్ల గణేష్ ఆరోపణ

నర్సీపట్నం అర్బన్, మార్చి2 (ఆంధ్రజ్యోతి) : శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆధ్వర్యంలో నర్సీపట్నంలో రాక్షస పాలన సాగుతుందని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ ఆరోపించారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తమపార్టీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ఆదివారం వైసీపీ యూత్ అధ్యక్షుడు అల్లంపల్లి ఈశ్వరరావుపై తప్పుడు కేసులు పెట్టారన్నారు. స్పీకర్ ఒత్తిడి మేరకు కేసులు నమోదు చేయడం తగదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వడ్డీతోసహా తగిన మూల్యం చెల్లిస్తామన్నారు. కక్షపూరిత రాజకీయాలు మానుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఏకా శివ, కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలకు విశేష స్పందన



మాకవరపాలెంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

మాకవరపాలెం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మాకవరపాలెంలో శంకర్ ఫౌండేషన్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 120మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 40 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరిని విశాఖపట్నంలో శంకర్ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నారు. కార్యక్రమంలో నేత్ర వైద్య నిపుణులు గౌరీ, శివ, మనోహర్, శంకర్ ఫౌండేషన్ కో-ఆర్డినేటరు ఆశ్విని కుమార్ పాల్గొన్నారు.

మునిసిపాలిటీ, ఈపీడీసీఎల్ మధ్య వై(వా)ర్

- »» థర్డ్ వైర్ సమస్యతో ఆగని వీధి దీపాలు
- »» ఐదేళ్లుగా విద్యుత్ వృథా
- »» థర్డ్‌వేర్ వేయాల్సిన బాధ్యత ఈపీడీసీఎల్‌దే: మునిసిపాలిటీ
- »» మునిసిపల్ అధికారులు కోరితే అంచనాలు తయారు: ఈపీడీసీఎల్


చింతపల్లి రోడ్డులో పట్టపగలు వెలుగుతున్న వీధి దీపం

నర్సీపట్నం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ, ఈపీడీసీఎల్ మధ్య థర్డ్ వైర్ సమస్యపై వార్ నడుస్తోంది. థర్డ్ వైర్ వేయాల్సిన బాధ్యత మీదంటే మీదని ఇరు శాఖలు నెట్టుకుంటున్నాయి. ఫలితంగా గత ఐదేళ్లగా మునిసిపాలిటీలో వందల కొలది వీధి దీపాలు ఆగకుండా వెలుగుతునే ఉన్నాయి. మునిసిపాలిటీ ప్రతి నెలా చెల్లిస్తున్న స్ట్రీట్ లైట్లు బిల్లులో పది శాతం వృథా అవుతున్నదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నర్సీపట్నం మునిసిపాలిటీలో 3,500 స్ట్రీట్ లైట్లు ఉండగా 400లకు పైగా లైట్లు రాత్రి, పగలు వెలుగుతున్నాయి. విద్యుత్ ఆదా చేయాలని కేంద్ర ప్రభుత్వం సూర్యఘర్ పథకంలో సౌర విద్యుత్‌కి భారీగా రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తుంటే.. ఇక్కడ విద్యుత్ వనరులను వృథా చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఒకటి కాదు రెండు కాదు ఐదేళ్లుగా థర్డ్ వైర్ వలన స్ట్రీట్ లైట్లు సమస్య మునిసిపాలిటీని వెంటాడుతోంది. ప్రతి నెలా మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో ఈ సమస్య మీద కౌన్సిలర్లు గళమెత్తినా పట్టించుకోవడం లేదు. ఎటూ తేలకపోవడంతో మునిసిపల్ కమిషనర్ సురేంద్ర ఈ సమస్యను స్పీకర్ అయ్యన్నపాత్రుడు దృష్టిలో పెట్టారు.

థర్ వైర్ బాధ్యత ఈపీడీసీఎల్‌దే..

విద్యుత్ స్తంభాలకు థర్డ్ వైర్ వేయాల్సిన బాధ్యత ఈపీడీసీఎల్‌దేని మునిసిపల్ కమిషనర్ సురేంద్ర అన్నారు. దీనిపై ఈపీడీసీఎల్‌కి అధికారికంగా లెటర్ పెట్టామని తెలిపారు. వారి వద్ద నుంచి ఏ విధమైన స్పందన రాలేదన్నారు.

థర్ వైర్ ఖర్చు మునిసిపాలిటీదే..

థర్డ్ వైర్ కావాలని దరఖాస్తు పెట్టుకుంటే అంచనాలు తయారు చేస్తాం. ఆ మేరకు మునిసిపల్ అధికారులు డీడీ తీసి ఇస్తే థర్డ్ వైర్ వేస్తామని ఈపీడీసీఎల్ పట్టణ ఏఈ మనోజ్‌కుమార్ తెలిపారు. పాత వైర్ పాడైనచోట తాము థర్డ్ వైర్ మార్చుతామన్నారు. అయ్యన్నకాలనీలో పాడైపోయిన థర్డ్ వైర్ మార్చామన్నారు.

జి.కోడూరులో అధ్వానంగా పారిశుధ్యం


జి.కోడూరు గ్రామంలో రోడ్డుపై వేసిన చెత్త

మాకవరపాలెం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో జి.కోడూరు గ్రామంలో రోడ్లపై చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. గ్రామంలో ఉన్న చెత్తను తీసుకువచ్చి గ్రామానికి వెళ్లే రహదారిపైనే గ్రామస్థులు చెత్తను వేస్తున్నారు. దీంతో గ్రామాలోకి వెళ్లాలంటే ముక్కు మూసుకొని వెళ్లవలసి వస్తుంది. సంపద కేంద్రం ఉన్నా చెత్తను అక్కడ కాకుండా రోడ్లుపైన కుప్పలు వేస్తున్నారు. చెత్తకుప్పలతో రాత్రి సమయాల్లో దోమల బెడద ఎక్కువగా ఉందని పరిసర ప్రాంత ప్రజలు వాపోతున్నారు. దీనికి తోడు మురుగు కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో మురుగునీరు నిలిచిపోతున్నదని వారంటున్నారు. పంచాయతీ సిబ్బంది స్వచ్ఛత-శుభ్రతపై ప్రచారం చేస్తున్నారే తప్ప దానిని ఆచరణలోకి తీసుకురాలేదని వారు తెలిపారు. రోడ్డుపై ఉన్న చెత్త కుప్పలకు నెలకొకసారి నిప్పు పెట్టడంతో పొగ కమ్ముకుంటుందని, దీనివల్ల దగ్గు వస్తున్నదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తిపై పోక్సో కేసు

రాంబిల్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం చేసిన కేసులో మండలంలోని కృష్ణంపాలెం గ్రామానికి చెందిన లాలం రామదాస్ (33)పై ఆదివారం పోక్సో కేసు నమోదు చేసినట్టు రాంబిల్లి సీఐ నరసింగరావు తెలిపారు. తన కుమార్తెను లాలం రామదాస్ అత్యాచారం చేశాడని బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గుమ్మిడిగొండ మెయిన్ రోడ్డుపై గోతులు


అధ్వానంగా ఉన్న గుమ్మిడిగొండ మెయిన్‌రోడ్డు

నాతవరం, మార్చి2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుమ్మిడిగొండ మెయిన్ రోడ్డు గోతులతో అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డును ఆర్‌అండ్‌బీ అధికారులు కనీసం మరమ్మతులు కూడా చేపట్టడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. కొళాయిల వృథా నీరు మెయిన్ రోడ్డుపై ఉన్న గోతులలో నిలిచిపోవడంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డుపై భారీ వాహనాలు వెళ్లేటప్పుడు గోతుల్లో నీరు పాదచారులపై తుళ్లుతున్నది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి గుమ్మిడిగొండ మెయిన్‌రోడ్డుపై గోతులు పూడ్చేందుకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రారంభానికి సిద్ధంగా మోడల్ పోలీస్ స్టేషన్


కృష్ణాదేవిపేట మోడల్ పోలీస్ స్టేషన్

కృష్ణాదేవిపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో నూతనంగా నిర్మించిన మోడల్ పోలీస్ స్టేషన్ ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఈ పోలీస్ స్టేషన్ నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వం హయాంలో రూ.2.5 కోట్లు మంజూరు చేశారు. గత ఆరేళ్లుగా నత్తనడకన జరిగినప్పటికీ నేటికి పూర్తి చేశారు. బ్రిటిష్ పాలనలో విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు దాడి చేసిన పోలీస్ స్టేషన్ శిథిలావస్థకు చేరుకోవడంతో మోడల్ పోలీస్ స్టేషన్ నిర్మాణానికి అప్పటి విశాఖ రేంజ్ డీఐజీ శ్రీకాంత్ నిధులు మంజూరు చేయించారు. సరైన వసతి లేక పోలీసులు చాలా సంవత్సరాలు ఇబ్బంది పడ్డారు. నూతన భవనం నిర్మాణంతో వీరి కష్టాలతో తొలగినట్టే. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం పోలీస్ స్టేషన్‌ని ప్రారంభించనున్నట్టు సమాచారం.

అనకాపల్లి ట్రెజరీ ఉద్యోగుల సంఘం కార్యవర్గం


ట్రెజరీ ఉద్యోగుల సంఘానికి ఎన్నికైన సభ్యులు

విశాఖపట్నం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా ఖజానా ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగరంలోని జడ్పీ కార్యాలయానికి సమీపంలో ఉన్న పెన్షనర్ల సంఘ భవనంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా యు.వెంకటేశ్, అసోసియేషన్ అధ్యక్షుడిగా పి.రాజేశ్, కార్యదర్శిగా వి.సింహాచలంనాయుడు, కోశాధికారిగా వై.వెంకటేశ్, ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఎస్.కొండలరావు వ్యవహరించారు.

మోదకొండమ్మ ఆలయంలో విశేష పూజలు



మాడుగుల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారిని విశేషంగా అలంకరించిన అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పెద్ద సంఖ్యలో మహిళలు కుంకుమార్చనలు జరిపారు. పలువురు భక్తులు ఘటాలను ఊరేగింపుగా తీసుకు వచ్చి సమర్పించారు. ఇదిలావుంటే, మోదకొండమ్మ తీర్థం మంగళవారం జరగనుంది. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపట్టినట్టు ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఎడ్లబండ్ల పరుగు పోటీ నిర్వహించనున్నామన్నారు.

ఘనంగా మోదకొండమ్మ పాదాల తీర్థం


అమ్మవారి పాదాలను దర్శించుకుంటున్న భక్తులు

మాడుగుల రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఘాట్‌రోడ్డు జంక్షన్‌లోని మోదకొండమ్మ పాదాల వద్ద ఆదివారం తీర్థాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, మాజీ జడ్పీటీసీ పుప్పాల సరోజిని దంపతులు అమ్మవారికి పూజలు చేశారు. వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన గుర్రపు పరుగు పందేలను ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. సాయంత్రం ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రేపటి నుంచి వడ్డాది గ్రామంలో...

బుచ్చెయ్యపేట : వడ్డాది నాలుగురోడ్ల కూడలిలో ఉన్న మోదకొండమ్మ ఆలయంలో ఈనెల నాలుగో తేదీ మంగళవారం నుంచి ఆరో తేదీ వరకు తీర్థాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపట్టినట్టు ఆలయ కమిటీ చైర్మన్ దొండా గిరిబాబు తెలిపారు. రాత్రికి పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

భక్తిశ్రద్ధలతో గౌరీపరమేశ్వరుల తీర్థం

రోలుగుంట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొవ్వూరులో ఆదివారం గౌరీపరమేశ్వరుల తీర్థాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ కాంతమ్మ, రాజారావుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు పెద్ద సంఖ్యల భక్తులు విచ్చేశారు. వేకువజాము నుంచి ఆది దంపతులకు విశేష పూజలు జరిపారు. రాత్రికి ఏర్పాటైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

బంగారమ్మపాలెంలో శ్రీరామ విగ్రహం ప్రతిష్ఠ

చోడవరం, మార్చి2 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారు బంగారమ్మపాలెంలో ఆదివారం శ్రీరామ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	482
విజయనగరం	486
శ్రీకాకుళం	486

ఎస్‌ఐలుగా శిక్షణ పూర్తిచేసుకున్న బావ, బావమరిది

»» విజయనగరంలో పోస్టింగ్‌లు పొందిన పి.పొన్నవోలు యువకులు »» ఒకే కుటుంబంలో ఇద్దరికి ఉద్యోగాలు రావడంతో గ్రామస్థులు ఆనందం


శిక్షణ పూర్తిచేసుకుని విజయనగరంలో పోస్టింగ్‌లు పొందిన నాని, దుర్గాప్రసాద్

రావికమతం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఒక కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వస్తే ఆ ఇంట్లో వారందరికీ పండగే. అదే ఇంట్లో ఇద్దరికి అందునా సమాజంలో గౌరవ ప్రదమైన ఉద్యోగాలు వస్తే.. ఆ ఊరందరికీ ఆనందమే. ఇందుకు సంబంధించిన వివరాలివి. రావికమతం మండలం పి.పొన్నవోలు గ్రామానికి చెందిన పులఖండం నాని, కొరసాల దుర్గా ప్రసాద్ ఒకే కుటుంబానికి చెందిన వారు. బావ, బావమరుదులవుతారు. వీరు సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. పట్టుదలతో చిన్నప్పటి నుంచి కలిసి ఒకే పాఠశాలలో చదివారు. నేడు సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్‌ఐ) ఉద్యోగాలు పొందారు. పులఖండం వరహాలుబాబు, ఈశ్వరమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. రెండో సంతానం నాని. తన పెద్ద కుమారుడు హైదరాబాద్‌లో ప్రయివేట్ ఉద్యోగం చేస్తుండగా, రెండవ కుమారుడైన నాని ముందు తెలంగాణ పోలీసు శాఖలో, రైల్వేలో ఉద్యోగ అర్హత సాధించారు. అయితే సొంత రాష్ట్రంలో పోలీస్ ఉద్యోగం చేయాలన్న ఆకాంక్షతో నాని ఏపీ సివిల్ ఎస్‌ఐ పరీక్ష రాసి అర్హత సాధించారు. 52 వారాల పాటు అనంతపురంలో శిక్షణ పూర్తి చేసుకోవడంతో శనివారం పోలీస్ ఉన్నతాధికారుల నుంచి నియామక పత్రం అందుకున్నారు. విజయనగరంలో ఇతనికి పోస్టింగ్ లభించింది.

అలాగే వరహాలుబాబు చెల్లెలు కొరసాల సూర్యలక్ష్మి, తన బావ అప్పారావులకు కూడా ముగ్గురు కుమారులు. అప్పారావు పిల్లల చిన్నప్పుడే మృతి చెందారు. సూర్యలక్ష్మి భర్త మృతి చెందినప్పటికీ పుట్టింటివారు, అత్తంటివారితో కలిసి మెలసి ఉంటూ ఉన్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తూ ముగ్గురు పిల్లలను చదివించారు. పెద్ద కుమారుడు సెంట్రల్ గవర్నమెంటులో ఉద్యోగం సాధించి తన తమ్ములు ఇద్దరు చదువులకు సహకారం అందించారు. వీరిలో రెండవ వాడైన కొరసాల దుర్గా ప్రసాద్ ముందు గ్రామ సచివాలయం, కానిస్టేబుల్ ఉద్యోగాలు వచ్చినా కాదన్నారు. సివిల్ ఎస్‌ఐ సాధించాలన్న పట్టుదలతో చదివి సాధించారు. ఈయన కూడా అనంతపురంలో శిక్షణ పూర్తిచేసుకోవడంతో ప్రభుత్వం విజయనగరంలో ఉద్యోగం కల్పించింది. ఒకే కుటుంబంలో ఇద్దరు ఒకేసారి ఎస్‌ఐ ఉద్యోగాలు పొందడంతో ఆ కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్థులు ఆనందానికి అవధులు లేవు.

'నీటి కుంటల నిర్మాణానికి రైతులు ఆసక్తి చూపాలి'


ఓ గ్రామంలో రైతు తవ్విన నీటికుంట

బుచ్చెయ్యపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎంతో ప్రయోజనాన్ని చేకూర్చే నీటి నిల్వకుంటల నిర్మాణానికి రైతులు ముందుకురావాలని ఉపాధి హామీ పథకం ఏపీవో ఎస్.వరహాలుబాబు కోరారు. ఆదివారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడుతూ నీటిని నిల్వచేసేకుంటల ద్వారా రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. రెండు సెంట్లు భూమిలో ఈ కుంట రెండు మీటర్ల లోతు తవ్వి నీటిని నిల్వచేసుకుంటే ఆ భూమి చుట్టూ కూరగాయలు, వివిధ రకాల మొక్కలు పెంపకానికి అందులో నిల్వ ఉన్ననీరు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఇందుకు ప్రభుత్వం రూ.50 వేలు వరకూ భరిస్తుందని, అలాగే అంతకన్నా పెద్ద నీటికుంటలు తవ్వకానికి పదిసెంట్లు వరకూ తవ్వితే చేపల పెంపకానికి అనుకూలంగా ఉంటుందని వివరించారు. దీనికి ప్రభుత్వం రెండు లక్షల రూపాయల మేర అందజేస్తుందని చెప్పారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

యాదవ సంఘం పట్టణ అధ్యక్షుడిగా వాకాడ సత్తిబాబు


ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

చోడవరం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): యాదవ సంఘం పట్టణ నూతన అధ్యక్షునిగా వాకాడ సత్తిబాబు ఎన్నికయ్యారు. ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పినబోయిన అప్పారావుయాదవ్, ఉపాధ్యక్షునిగా సింగంపల్లి దుర్గారావు, కార్యదర్శిగా పల్లా సన్నిబాబు, సంయుక్త కార్యదర్శిగా ఆబోతుల శ్రీనివాసరావు, కోశాధికారిగా మురుగుతి అప్పారావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉరుకుటి గోవింద్ ఎన్నికయ్యారు. న్యాయ, మీడియా సలహాదారులుగా నంబారు నరసింగరావు, సానబోయిన గోవింద్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జోగ కుళ్లన్నలను ఎన్నుకున్నారు.

ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అమరులకు నివాళి


మాదిగ అమరులకు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

చోడవరం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ కోసం జరిగిన పోరాటంలో ప్రాణాలర్పించిన మాదిగ అమరులు స్ఫూర్తిదాయకులని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలకా మల్లిబాబు అన్నారు. స్థానిక ఇందిరా కాలనీలో ఆదివారం ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. మాదిగజాతి చిరకాలం వాంఛ నెరవేరుతున్న సమయంలో వారి త్యాగాలను గుర్తుచేసుకోవడం ప్రతి మాదిగపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ఎలుసూరి గాటీలు, కట్టమూరి మంగరాజు, కొల్లి చిన అప్పారావు, కాకినాడ కనకేశ్వరరావు, గోటివాడ సామ్రాట్ కుమార్, ఇ.గోపి, మారేడుపూడి కోటి, రవికుమార్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి సభ్యులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో విగ్రహం ప్రతిష్ఠ



రావికమతం, మార్చి2, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం రావికమతంలో నూతనంగా నిర్మించిన కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ఆదివారం ప్రతిష్ఠించారు. బ్రాహ్మణ వీధిలో ఆర్యవైశ్య సంఘ పెద్దలు, సభ్యులు ఆధ్వర్యంలో ఈ ఆలయాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

6న అప్పలరాజుపురంలో శివాలయం ప్రారంభోత్సవం

చీడికాడ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : అప్పలరాజుపురంలో నిర్మించిన అన్నపూర్ణసమేత విశ్వేశ్వరస్వామి ఆలయం ఈ నెల ఆరో తేదీన ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపడుతున్నట్టు సర్పంచ్ చుక్క అప్పలనాయుడు తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా మంగళవారం నుంచి విశేష పూజలు ప్రారంభం కానున్నాయన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా కోరారు.

శిలాఫలకం ధ్వంసం చేశారని ఫిర్యాదు

దేవరాపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంతతోట నుంచి చిననందిపల్లి, చేనులపాలెం, పెదనందిపల్లి గ్రామాలను కలుపుతూ నిర్మించిన రోడ్ల ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారంటూ వైసీపీ మండల అధ్యక్షుడు బూరే బాబూరావుతో పాటు పలువురు ఆదివారం ఇక్కడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత ఏడాది జనవరి 13న అప్పటి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు రోడ్డును ప్రారంభోత్సవం చేశారన్నారు. గత నెల 26వ తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శిలాఫలకాన్ని ధ్వంసం చేశారని ఆరోపించారు.

శ్రీకృష్ణుని ఆలయ నిర్మాణానికి భూమిపూజ


శంకుస్థాపన చేస్తున్న భక్తులు

చింతపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెద పైపువీధిలో శ్రీకృష్ణుని ఆలయం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ వీధిలో 30ఏళ్ల క్రితం శ్రీకృష్ణ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజలు జరుపుతున్నారు. తాజాగా భక్తులు నూతన ఆలయం నిర్మాణం కోసం రూ. 15లక్షల విరాళాలు సమీకరించారు. ఈమేరకు నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వర్తకసంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, హెచ్‌డబ్ల్యూవో పసుపులేటి వినాయకరావు, గ్రామ పెద్దలు గోకాడ సత్యనారాయణ,తదితరులున్నారు.

పాడేరు- భద్రాచలం ఆర్టీసీ బస్సులకు రిజర్వేషన్ సౌకర్యం

సీలేరు, మార్చి 2 , (ఆంధ్రజ్యోతి) : పాడేరు- భద్రాచలం మధ్య నడిచే రెండు ఆర్టీసీ బస్సు సర్వీసులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తున్నట్టు పాడేరు డిపో మేనేజర్ ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. భద్రాచలంనకు చింతపల్లి, జీకేవీధి, సీలేరు, డొంకరాయి, మోతుగూడెం, చింతూరు, కూనవరం మీ దుగా భద్రాచలంనకు పాడేరులో ఉదయం 7.30 నిమిషాలకు ఒకటి, అలాగే సాయంత్రం 4.30నకు రెండో సర్వీసు బయలుదేరుతుందన్నారు. ఉదయం 7.30 నిమిషాలకు పాడేరులో బయలు దేరిన బస్సు సాయంత్రం 5.30కు భద్రాచలం చేరుతుందని, రెండవ బస్సు రాత్రి 2.30 నిమిషాలకు వెళ్తుందన్నారు. అలాగే తిరిగి భద్రాచలం లో మరుసడి ఉదయం 7.30 బయలు దేరి పాడేరు సాయంత్రం 5.30 చేరుతుందని, రెండో బస్సు భద్రాచలంలో రాత్రి 8.30కు బయలు దేరి పాడేరు ఉదయం 6 గంటలకు చేరుతుందన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ బస్సులకు రిజర్వేషన్ అందుబాటులోకి తెచ్చినట్టు ఆయన తెలిపారు.

ఎస్సీల అభ్యున్నతికి సీఎం కృషి

అనంతగిరి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు చేస్తున్న కృషి హర్షణీయమని స్టేట్ ఎస్సీ సెల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ పెరుమాల నిర్మల ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బడ్జెట్‌లో ఎస్సీలకు రూ. 20వేల కోట్లకుపైగా కేటాయించడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం ఎస్సీలను చిన్నచూపు చూసిందన్నారు.

మహిళా సాధికారిత సదస్సుకు మఠం సర్పంచ్ ఎంపిక


ఢిల్లీ వెళ్లనున్న సర్పంచి శాంతకుమారి

పాడేరురూరల్, మార్చి 2 (ఆంధ్ర జ్యోతి): కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారతపై ఢిల్లీలో ఈ నెల 4, 5వ తేదీలలో నిర్వహించనున్న వర్క్‌షాపునకు అల్లూరి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు, హుకుంపేట మండలం మఠం పంచాయతీ సర్పంచ్ మఠం శాంతకుమారి హాజరు కానున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన జరగనున్న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ వర్క్‌షాప్ జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నుంచి తనకు ఆహ్వానం వచ్చిందని ఆమె తెలిపారు. మహిళల నేతృత్వంలో స్థానిక సంస్థలలో బలోపేతం, నాయకత్వ లక్షణాలు పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ సదస్సులను నిర్వహిస్తున్నారన్నారు. సోమవారం ఢిల్లీ పయనమై వెళ్తున్నానని ఆమె తెలిపారు.వర్క్‌షాప్‌కు తనకు ఆహ్వానించిన ప్రధాని నరేంద్రమోదీకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధులకు రగ్గులు వితరణ


కులబీరు గ్రామంలో రగ్గులు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు

పాడేరురూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పాడేరు బ్రాంచి ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆదివారం హుకుంపేట మండలం సంతారి పంచాయతీ కులబీరు గ్రామంలో 60 మంది వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. జిల్లాలో రక్త నిల్వల సమస్యను పరిష్కరించేందుకు రెడ్ క్రాస్ సొసైటీ రక్త శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్వచ్ఛందంగా ప్రజలు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ పాడేరు బ్రాంచి ప్రతినిధులు ఎస్.గంగరాజు, జి.గౌరీశంకరరావు, ప్రసాద్, రవి, సంజీవ్, లోకేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఆంగ్ల పోటీలకు ఎంపిక


ఆంగ్ల పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థి దీపిక

ముంచంగిపుట్టు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమడ పంచాయతీ చీపురుగొంది ఎంపీపీఎస్ పాఠశాలలోని మూడో తరగతి చదువుతున్న కిల్లో దీపిక విభ లీఫ్ పార్వర్డ్ ఇంగ్లిష్ వర్డ్ పవర్‌ఛాంపియన్‌షిప్ జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రా ష్ట్రస్థాయికి ఎంపికైంది. శనివారం పాడేరులో జరిగిన ఈ పోటీల్లో తక్కువ సమయంలో ఆం గ్లంలోని ఇచ్చిన అంశాలన్నీ చదివి సత్తా చాటింది. ఈ నేపథ్యంలో ఈనెల 13 తేదీన విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ఉపాధ్యాయుడు హనుమంతు తెలిపారు. వరసగా రెండోసారి రాష్ట్రపోటీలకు దీపక ఎంపికకావడంపై గ్రామస్థులు అభినందించారు.


ఉబ్బర్తి కూడలి నుంచి చింతలపూడి మధ్య నీటి తడులులేక ఎండిన మొక్కలు


ఆలన పాలనా కరువై చనిపోయిన మొక్కలు

కానరాని 'గ్రీన్ ఫీల్డ్'

- జాతీయ రహదారి విస్తరణలో చెట్లు తొలగింపు
- తిరిగి నాటిన మొక్కలకు సంరక్షణ కరవు
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యం
- పచ్చదనం మాయం

కొయ్యూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ హైవే 516 నిర్మాణంలో భాగంగా రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలు సంరక్షణలేక చనిపోతున్నాయి. గతంలో ఉన్న రహదారిని విస్తరించి, రోడ్డుకు ఇరువైపులా ఉన్న వేలాది చెట్లను తొలగించారు. వాటి స్థానంలో తిరిగి పూర్వ వైభవం తీసుకువచ్చేలా గత సెప్టెంబరులో సంబంధిత కాంట్రాక్టరు మొక్కలు నాటారు. ఇలా నాటించిన మొక్కలు అప్పట్లో వర్షాలు కురవటంతో నిలిచాయి. వీటిని పశువుల బారి నుంచి రక్షించేలా కర్రలు పాతి వాటికి సిమెంట్ బస్తాల సంచులను తగిలించారు. అయితే, సిమెంట్ గోనెలు కాలక్రమేణా చిరిగిపోయాయి. కర్రలు విరిగిపోయాయి. దీంతో మొక్కలకు పశువుల నుంచి రక్షణ కరువైంది. పశువులు, మేకలు చిగుళ్లు తినేస్తుండడంతో మొక్కలు మోడు వారాయి. దీనికి తోడు వేసవి తోడైం ది. మోడులు చిగురించే లా ఎప్పటికప్పుడు నీటి తడులు పెట్టే చర్యలు లేకపోవటంతో వేసిన మొక్కలన్నీ సగానికి పైగా చనిపోయాయి. మండలంలో కాకరపాడు నుంచి వైఎన్ పాకలు కూడలి దాటేవరకు 30 శాతం మేర మొక్కలు చనిపోగా మిగిలిన 70 శాతం రేపోమాపో అన్నట్లున్నాయి. నాటిన మొక్కలు నిలిస్తే ఐదేరేళ్లలో తిరిగి పూర్వ వైభవం వస్తుంది.కానీ, నిర్లక్ష్యం వల్ల గతంలో పచ్చదనంతో కళకళలాడిన ఈ రహదారి విస్తరణ పేరుతో ధ్వంసం చేయడం పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ రహదారి నిర్మాణ బాధ్యతలు చేపట్టిన కాంట్రాక్టరు గతంలో రహదారికి ఇరువైపులా చెట్లు తొలగించి సొమ్ము చేసుకోవటంలో చూపిన శ్రద్ధ తిరిగి వాటి స్థానంలో కొత్త వాటిని పరిరక్షించడంలో చూపకపోవడంపై సర్వత్రా విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ విషయమై దృష్టి సారించి చుట్టూ మొక్కలను మళ్లీ నాటించి , వాటి సంరక్షణకు శాశ్వత ఫెన్సింగ్ వేయించేలా చర్యలు చేపట్టాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

చిరు ధాన్యాల మేళాకు ప్రయాణం


హైదరాబాద్ పయనమవుతున్న రైతులు

జి.మాడుగుల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ ఐఐఆర్ హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మిల్లెట్ కిసాన్ మేళాకు మండలంలోని మత్స్యదేవత ఎఫ్‌పీవో సంఘం ఆధ్వర్యంలో 40 మంది గిరిజన రైతులు హాజరవుతున్నట్టు సీఈవో ఐసారం హనుమంతరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రత్యేక బస్సులో పయాణమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 3, 4 తేదీలలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ ఆడిటోరియం లో నిర్వహించే ఈ మేళాలో శాస్త్రీయ సాగు, జీవవైవిధ్య పరిరక్షణ పోషకఆహార విలువలతో కూడిన చిరు ధాన్యాలు ఉత్పత్తులపై సమావేశం జరుగుతుంది. ప్రాసెసింగ్ వాటి మార్కెట్ తదితర అంశాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తారని హనుమంతరావు చెప్పారు.

ప్రవేశ పరీక్షకు 325 మంది హాజరు

గూడెంకొత్తవీధి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల ప్రవేశ పరీక్షకు ఆదివారం స్థానిక ఈఎంఆర్ పాఠశాలలో ప్రవేశ పరీక్ష జరిగింది. ఈ కేంద్రంలో 328 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎంవీ రమణ పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాడేరురూరల్, మార్చి 2(ఆంధ్ర జ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మన్యంలోని వివిధ గ్రామాల ప్రజలతో పాటు మైదాన ప్రాంతం నుంచి వచ్చిన వందలాది మంది భక్తులతో అమ్మవారి దర్శనానికి వచ్చారు. దీంతో ఉదయం 6 నుంచి రద్దీ నెలకొంది భక్తుకు ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రమణ్యం శాస్త్రి పూజలు, అభిషేకాలను నిర్వహించారు. మైదాన ప్రాంత భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకొని ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ప్రాంగణంలో వంటలు చేసుకొని బంధు మిత్రులు, కుటుంబ సభ్యులతో సాయంత్రం వరకు గడపటంతో ఆలయం భక్తులతో కళకళలాడింది. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు ఉదయం అమ్మవారి ప్రసాదం, మధ్యాహ్నం అన్న ప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు నల్లా రామకృష్ణ, బోనంగి వెంకటరమణ, దన్నేటిపలాసి రాము, కిల్లు రాధాకృష్ణం నాయుడు, లకే రత్నాబాయ్, కారం దేముడు, గబులంగి శంకరరావు, కిల్లు చంద్రమోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. పాడేరు ఘాట్‌లోని మోదాపల్లి జంక్షన్ వద్ద గల అమ్మవారి పాదాలను దర్శించుకొనేందుకు మైదాన ప్రాంతం నుంచి వందలాది మంది భక్తులు కుటుంబ సభ్యులతో వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

ఆదివాసీల సమస్యలపై 6, 7 తేదీలలో రిలే నిరాహార దీక్షలు


రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

పాడేరురూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 6, 7వ తేదీలలో పాడేరు ఐటీడీఏ కార్యాలయం ఎదుట చేపట్టనున్న రిలే నిరాహార దీక్షలను విజయవంతం చేయాలని అఖిలపక్ష రాజకీయ ప్రజా సంఘాల నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పీఎంఆర్సీ భవనంలో అఖిలపక్ష రాజకీయ ప్రజా సంఘాల ఐక్యవేదిక రౌండ్ టేబుల్ సమావేశాన్ని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మన్నపడాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, 1/70 సవరణపై అసెంబ్లీ సభాపతి అయ్యన్న పాత్రుడు వ్యాఖ్యలపై ఇటీవల ఆదివాసీలు చేపట్టిన బంద్ నేపథ్యంలో స్పందించిన ముఖ్యమంత్రి చం ద్రబాబు నా యుడు చట్టాన్ని గౌరవిస్తున్నామని, రద్దు చేసే ఆ లోచన లేదని ప్రకటించడం హర్షణీయమన్నారు. అయితే, దీనిపై అసెంబ్లీలో ప్రభుత్వ వైఖరి తెలియజేస్తూ స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. అయ్యన్నపాత్రుడు ఆదివాసీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే, హైడ్రో పవర్ ప్రాజెక్టు పేరుతో మన్యంలోని అటవీ ప్రాంతాన్ని అదానీ, అంబానీలకు కట్టబెట్టాలని చూడడం అన్యాయమన్నారు. ఈ సమావేశంలో గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, చిట్టిబాబు, నాయకులు ఆర్.మల్లమ్మ, కె.అరుణ, శ్రీలత, రాజశేఖర్, చిన్నారావు, రాజు, భాను, లక్ష్మణరావు, సీత, చిన్నమ్మి, అశోక్‌కుమార్, బుల్లెమ్మ, శైలు, భీముడు, కృష్ణ, సోంబాబు పాల్గొన్నారు.

'ఏకలవ్య' ప్రవేశ పరీక్షకు 990 మంది హాజరు

చింతపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మూడు కేం ద్రాల్లో జరిగిన ఏకలవ్య ఆదర్శ నివాసానుబంధ పా ఠశాల ప్రవేశ పరీక్షను 990 మంది విద్యార్థులు రాశారు. స్థానిక ఈఎంఆర్, కొయ్యూరు ఈఎంఆర్ (వైటీసీ), ఏపీ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఈ ఎంఆర్ పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు ఈ పరీక్ష జరిగింది. చింతపల్లి ఈఎంఆర్‌లో 480మంది విద్యార్థులకు గానూ 460మంది హాజరుకాగా 20మంది గైర్హాజరయ్యారు. కొయ్యూరు ఈఎంఆర్‌లో 261మందికి 243మంది పరీక్షలు రాశారు. 18మంది పరీక్షకు హాజరుకాలేదు. గురుకుల జూనియర్ కళాశాలలో 301 మందికి 287మందిలో 14మంది గైర్హాజరయ్యారు. ప్రవేశ పరీక్ష గురుకులం అధికారుల పర్యవేక్షణలో ప్రశాంతంగా జరిగింది.

అరకులోయలో..

అరకులోయ: అరకులోయలో రెండు గురుకుల ఆశ్రమోన్నత పాఠశాలలు, రెండు జూనియర్ కళాశాలలో ఆదివారం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో 6 వ తరగతి ప్రవేశ పరీక్ష ఆదివారం నిర్వహించారు. ఉదయం 11.30 నుంచి ఒంటి గంట వరకు ఈ పరీక్ష కొనసాగింది. ఈ నాలుగు పరీక్ష కేంద్రాల్లో 1466 మంది బాల, బాలికలు హాజరుకావాల్సి ఉండగా, 1384 మంది పరీక్ష రాసినట్టు అరకులోయ, అనంతగిరి ఏకలవ్య పాఠశాలల ప్రిన్సిపాళ్లు సన్యాసినాయుడు, భాస్కరరావు తెలిపారు. ఆశ్రమోన్నపాఠశాల లో 398 మందికి 379 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు. గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో 200 మందికి, 189 మంది పరీక్ష రాశారన్నారు. ఈఎంఆర్ స్కూల్ కో-ఎడ్యుకేషన్ పాఠశాలలో 473 మందికి 450 మంది విద్యార్థులు, గురుకుల బాలుర ఆశ్రమోన్నత కళాశాలలో 395 మందికి, 366 మంది విద్యార్థులకు పరీక్షకు హాజరయ్యారన్నారు.


చింతపల్లిలో పరీక్ష రాసి వస్తున్న చిన్నారులు

హెల్మెట్ ధారణ తప్పనిసరి: ఎస్ఐ


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అప్పలసూరి

గూడెంకొత్తవీధి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని స్థానిక ఎస్సై అప్పలసూరి అన్నారు. ఆదివారం జీకేవీధి జంక్షన్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై ద్విచక్రవాహనదారులతో మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల సమయంలో ప్రాణాలను కాపాడుకోవచ్చునన్నారు. హెల్మెట్ లేకుంటే రూ.వెయ్యి అపరాధ రుసుము విధిస్తామన్నారు. లైసెన్సులేకుండగా వాహనాలు నడపరాదన్నారు. వాహనాల ఆర్‌సీ, పొల్యూషన్, ఇన్సూరెన్స్ పత్రాలు ఉండాలన్నారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

అటవీ శాఖ అనుమతుల కోసం వినూత్న నిరసన


అడ్డాకుల టోపీలతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

అనంతగిరి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాణిజ నుంచి చినకోనెల, బూరుగు గ్రామాల రోడ్డు పనులకు అటవీ అనుమతులు ఇవ్వాలని ఆ గ్రామాల గిరిజనులు ఆదివారం అడ్డకులతో తయారుచేసిన టోపీలతో వినూత్న నిరసన తెలిపారు. 2024లోని జాతీయ ఉపాధి హామీ పథకంలో ఈ రోడ్డు నిర్మాణానికి రూ. 3కోట్లను మంజూరు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. అయితే, అటవీశాఖ అనుమతులురాక ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదన్నారు. దీంతో సుమారు 8 కిలో మీటర్లు ఆయా గ్రామాల గిరిజనులు కాలినడకన ప్రయాణాలు సాగించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

పాఠశాలల విలీనం సరికాదు


సరయువలసలో ఆందోళన చేస్తున్న చిన్నారుల తల్లిదండ్రులు

డుంబ్రిగుడ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మోడల్ పాఠశాలల పే రిట ప్రాథ మిక పాఠశాలల వీలినం చేయడం తగదని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ అన్నారు. మండలంలోని గుంటసీమ పరిధి సరియవలస గ్రామంలో ఆయన సందర్శించారు. గిరిజన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇ టీవల రాష్ట్ర ప్రభుత్వం మోడల్ పాఠశాలల పేరుతో పంచాయతీ కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లోని మూడు, నాలుగు, ఐదు తరగతులు విలీనం చేసి మోడల్ పాఠశాలలను అభివృద్ధి చేయాలనే ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పాఠశాలల విలీనంతో మన్యంలో గిరిజన విద్యాభివృద్ధి కుంటపడిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇదే పరిస్థితి తీసుకువస్తే చిన్నారులు పూర్తిగా విద్యకు దూరమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విలీనం ప్రక్రియ ప్రయత్నాలు మానుకోవాలని ఆ యన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రాందాస్, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆందోళన


గిరిజనులతో కలిసి ఆందోళన చేస్తున్న సుంకరమెట్ట సర్పంచ్ చినబాబు

అరకులోయ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ అనుమతులు రాక గిరిజనులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగసామ్యంతో రహదారులు, పక్కా ఇళ్లు మంజూరు చేసినా వాటిని పూర్తిచేయలేని పరిస్థితి నెలకొంటోంది. సుంకరమెట్ట పంచాయతీ పరిధిలో పీవీటీజీ గ్రామం లింబగుడకు దండబాడు వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర పూర్తికాకపోవడంతో సర్పంచ్ గెమ్మెలి చినబాబు శనివారం దండబాడు-లింబగుడ గ్రామాల మధ్య నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ చినబాబు మాట్లాడుతూ పల్లెపండగలో భాగంగా మూడు నెలల కిందట ఈ రహదారి నిర్మాణాకి రూ.90 లక్షలు మంజూరు చేసి శంకుస్థాపన చేశారన్నారు. అయితే, అటవీశాఖ అడ్డంకులతో పనులు నిలిచిపోయాయన్నారు. ఈ స్థితిలో జిల్లా కలెక్టర్ స్పందించి రోడ్డు నిర్మాణానికి అడ్డంకులు తొలగించేలా చొరవ తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

20 ఎకరాల్లో కాఫీ, మిరియాల తోటలు దగ్ధం

ముంచంగిపుట్టు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దా రైల పంచాయతీ తలింభ గ్రామ సమీపంలో 12 మంది గిరిజన రైతులకు చెందిన 20 ఎకరాల కాఫీ, మిరియాలు తోటలు ఆదివారం ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో టీడీపీ డివిజన్‌నేత, సర్పంచి పాండురంగస్వామి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా బాధిత రైతులు ఉదయం మంటలు వ్యాపించి. కాఫీ, మిరియాల తోటలు ఒక్కసారికి దగ్ధమయ్యాయని, ఆవేదన వ్యక్తం చేశారు. 14వేల కాఫీ మొక్కలు, 4వేల మిరియాల మొక్కలు నాశనమయ్యాయని, ప్రభుత్వం స్పందించి, గిరిజన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

గురువుల విజేత ఎవరో!

... 5వ పేజీ తరువాయి

ఏజెంట్ పాసులు జారీ చేశారు.

గెలుపుపై ముగ్గురు అభ్యర్థుల్లోనూ ధీమా

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పది మంది పోటీచేశారు. వీరిలో సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, కోరెడ్ల విజయగౌరి మధ్యే ప్రధాన పోటీ నెలకొందని ఎన్నికల విశ్లేషకులు చెబుతున్నారు. గెలుపుపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. రఘువర్మకు కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యులైన టీడీపీ, జనసేన పార్టీలు, గాదె శ్రీనివాసులనాయుడుకి బీజేపీలో వుండే ఆర్ఎస్ఎస్‌కు చెందిన కొందరు నాయకులు మద్దతు పలికారు. విజయగౌరి మద్దతుగా సీపీఎంతోపాటు కొన్ని వామపక్షాలు పనిచేశాయి.

వచ్చేస్తోంది ఈఎస్ఐ ఆస్పత్రి

... 5వ పేజీ తరువాయి

చేశారు. రూ.62.21 కోట్లతో 30 పడకల ఆస్పత్రితోపాటు 16 నివాస గృహసముదాయాలను నిర్మిస్తారు. నిర్మాణ బాధ్యతలను సీపీడబ్ల్యూడీకి ప్రభుత్వం అప్పగించింది. గత ఏడాది నవంబరులో పనులు ప్రారంభించారు. 18 నెలల్లో.. అంటే వచ్చే ఏడాది ఏప్రిల్‌నాటి పూర్తిచేయాలి. ఈఎస్ఐ ఆస్పత్రి అందుబాటులోకి వస్తే సర్జరీ, గైనికాలజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, ఎనస్థీషియా వంటి వైద్య నిపుణులు సేవలు అందుతాయి. రోగాలకు అవసరమైన మందులు కూడా ఉంటాయి. పది మంది అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులు పనిచేసే కర్మాగారాలు, కంపెనీల్లో నెలకు రూ.21 వేలు, అంతకన్నా తక్కువ వేతనాలు పొందుతున్న కార్మికులు/ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చు. అచ్యుతాపురం సెజ్‌కు 25 కిలోమీటర్ల పరిధిలో ప్రస్తుతం వున్న 600 కంపెనీలు, కర్మాగారాల్లో పనిచేస్తున్న సుమారు 37 వేల మంది కార్మికులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయం అందుతుంది. భవిష్యత్తులో ఏర్పాటు కానున్న కంపెనీలు, ఫ్యాక్టరీల్లో చేరే వారికి కూడా ఈ సదుపాయానికి అర్హులవుతారు.

యువతి మౌనపోరాటం

... 5వ పేజీ తరువాయి

దిగింది. ఈ సందర్భంగా నూకరత్నం మీడియాతో మాట్లాడుతూ, సతీశ్‌కు గతంలోనే పెళ్లయ్యిందని, కానీ ఈ విషయం దాచిపెట్టి తనను పెళ్లి చేసుకున్నాడని, బిడ్డ పుట్టిన దగ్గర నుంచి దూరంగా వుంటున్నా డని చెప్పింది. అతనిపై అనకాపల్లి దిశ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ హాజరుకాకుండా తిరుగుతున్నాడని ఆరోపిం చింది. గత్యంతరం లేని స్థితిలో బిడ్డతో కలిసి న్యాయం కోసం ఆందోళనకు దిగాల్సి వచ్చిందని చెప్పింది. కాగా సతీశ్ ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న నూకరత్నంను మాజీ ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, గాంధీ గ్రామం, నరసయ్యపేట సర్పంచ్‌లు గాడి అప్పారావు, ఉగ్గిన నాగబాబు, వైసీపీ నాయకులు శ్రీకాంత్, బైన ఈశ్వరరావు తదితరులు పరామర్శించారు. నూకరత్నంకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఎడాపెడా జరిమానాలు

... 5వ పేజీ తరువాయి

పట్టుబడితే వారికి రూ.10 వేలు జరిమానా విధిస్తారు. సీటు బెల్టు ధరించకుండా కారు నడిపితే సెక్షన్ 194 బి (1) ప్రకారం నడిసపే వ్యక్తికి రూ.వెయ్యి, డ్రైవర్ పక్కన కూర్చున్న ప్రయాణికుడికి రూ.వెయ్యి జరిమాన విధిస్తారు. వాహనం రిజిస్ట్రేషన్ లేదా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేదా రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేయించకుండా వాహనం రోడ్డుమీద తిరిగితే మొదటిసారి రూ.2, రెండోసారి పట్టుబడితే రూ.5 వేలు జరిమానా వుంటుంది. ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణిస్తే సెక్షన్ 194 సీ ప్రకారం రూ.1,000 జరిమానా చెల్లించాల్సి వుంటుంది.

రవాణా వాహనాలు ఓవర్‌లోడ్‌తో పట్టుబడితే ఇంతవరకు రూ.వెయ్యి జరిమానా వుండగా, దీనిని ఏకంగా రూ.20 వేలకు పెంచారు. ప్రతి అదనపు టన్నుకి రూ.2 వేల చొప్పున చెల్లించాల్సి వుంటుంది. 108తోపాటు ఇతర అత్యవసర వాహనాలకు దారి ఇవ్వకుండా ఆటంకం కలిగిస్తే రూ.10 వేలు జరిమానా విధిస్తారు. వాహనానికి ఇన్సూరెన్స్ లేకపోతే 196ఏ సెక్షన్ ప్రకారం రూ.2 వేలు కట్టాల్సి ఉంటుంది. రెండోసారి పట్టుబడితే రూ.4 వేలు జరిమానా చెల్లించాలి. రాంగ్ రూట్‌లో వాహనాలను నడపడం, సిగ్నల్ జంపింగ్ వంటి ఉల్లంఘనలకు రూ.2 వేలు ఫైన్ విధిస్తారు. కాగా నూతన మోటారు వాహన చట్టాన్ని పోలీసు, రవాణా శాఖల అధికారులు శనివారం నుంచి అమలు చేస్తున్నారు. అనకాపల్లి ట్రాఫిక్ సీఐ వెంకటరావు ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న ఒక లారీకి రూ.60 వేలు జరిమానా విధించారు.

వైసీపీ నేత.. చెరువులో మట్టి మేత!

» చెరకాం పంచాయతీలో గట్ల చెరువు నుంచి తవ్వకాలు » ట్రాక్టర్ల ద్వారా తరలించి వ్యాపారం » పట్టించుకోని రెవెన్యూ, పోలీస్



వీఆర్‌ఏ రాగానే ట్రాక్టర్ల నుంచి మట్టి అన్‌లోడ్



చెరువులో మట్టిని తవ్వి ట్రాక్టర్లతో తరలిస్తున్న దృశ్యం

కశింకోట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెరకాం పంచాయతీలో గల గట్ల చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇక్కడ ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పోలీస్ అధికారులు కన్నెత్తి చూడకపోవడం విశేషం. వైసీపీ నేత అండదండలతోనే ఈ మట్టి అక్రమ తవ్వకాలు సాగుతున్నాయని గ్రామస్థులు బహిరంగంగానే వాపోతున్నారు. గత మూడు రోజులుగా ఎక్సకవేటర్ సహాయంతో చెరువులో మట్టిని తవ్వి, సుమారు ఐదు నుంచి ఎనిమిది ట్రాక్టర్లతో సమీపంలో ఉన్న ఇళ్ల పునాదులకు తరలించి సొమ్ము చేసుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కూడా వైసీపీ నేతలకే అధికారులు కొమ్ముకాస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు చేస్తే హడావుడి చేసి, మట్టి అక్రమ తవ్వకందారులతో చేతులు కలుపుతున్నారని చెప్పుకుంటున్నారు. చెరువులను పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రామస్థులంతా కోరుతున్నారు. ఓ పక్క లక్షలాది రూపాయలు వెచ్చించి పంచాయతీల్లో చెరువులను అభివృద్ధి చేస్తుంటే, మరో పక్క అక్రమార్కులు చెరువులను సైతం వ్యాపారాలకు ఇలా వాడుకోవడం తగదని దుమ్మెత్తి పోస్తున్నారు. తక్షణమే రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి, మట్టి అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేసి చెరువులను కాపాడాలని అంతా కోరుతున్నారు.

వీఆర్‌ఏ వచ్చి చూశారంతే..!

ఇదిలావుంటే, వీఆర్‌ఏ నాగేశ్వరరావు ఆదివారం సాయంత్రం మట్టి తవ్వకాలు జరుగుతున్న ప్రదేశాన్ని పరిశీలించారు. అతనిని చూసి ట్రాక్టర్లలోని మట్టిని సదరు అక్రమార్కుడు అన్‌లోడ్ చేయించాడు. అయినప్పటికీ ఆయా ట్రాక్టర్లను వీఆర్‌ఏ అదుపులోకి తీసుకోకపోవడం విశేషం.

పోక్సో చట్టాలపై అవగాహన అవసరం

» అనకాపల్లి అదనపు జిల్లా జడ్జి శ్రీవిద్య



విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి శ్రీవిద్య

కశింకోట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : పోక్సో చట్టాలపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని అనకాపల్లి అదనపు జిల్లా జడ్జి ఎస్.శ్రీవిద్య సూచించారు. మండలంలోని తాళ్లపాలెంలో గల డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి విషయాలతో పాటు, విద్యార్థినులు బయట ఎలా ప్రవర్తించాలో వివరించారు. అపరిచితుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఎస్ఐలు మనోజ్‌కుమార్, లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ జి.గ్రేస్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బంగారమ్మపాలెంలో క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న గ్రామ పెద్దలు

సబ్బవరం, మార్చి2 (ఆంధ్రజ్యోతి): బంగారమ్మపాలెంలో ఈనెల 13న ముత్య మాంబ అమ్మవారి అనుపోత్సవం జరగనున్న నేపథ్యంలో ఆదివారం జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. తొలుత ఈ పోటీలను గ్రామ పెద్దలు దాడి కన్నంనాయుడు, దొడ్డి సూర్యప్రకాశ్, దొడ్డి రాజు కోటి ప్రారం భించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి అనుపోత్సవం సందర్భంగా ఏటా ఇటువంటి పోటీలు నిర్వహించి గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. విజేతలకు వేడుక రోజున నగదు బహుమతులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శరగడం భువనేశ్, దొడ్డి బాలకృష్ణ, వీరఅప్పారావు, సోమేశ్వరరావు, దాడి శివ తదితరులు పాల్గొన్నారు.

'అపిటోరియా'లో ప్రమాదంపై విచారణకు డిమాండ్

పరవాడ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఫార్మాసిటీలోని అపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్-6లో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డైక్లోరైడ్ ద్రావణాన్ని పీల్చడం వలన కాంట్రాక్ట్ కార్మికుడు కె.అప్పలనాయుడు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలవడం యాజమాన్యం నిర్లక్ష్యానికి నిదర్శనంగా పేర్కొన్నారు. కార్మికుడు ఎయిర్‌షూట్ ధరించేలా ఉంటే ప్రమాదానికి గురయ్యేవాడు కాదన్నారు. కార్మికులకు యాజమాన్యమే ఎయిర్ షూట్‌లు ఇవ్వవలసి ఉన్నప్పటికీ ఎలాంటి భద్రత ప్రమాణాలు పాటించకుండా వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతుందని మండిపడ్డారు. గత ఏడాది ఇదే పరిశ్రమలో ఒక కార్మికుడు మృతి చెందిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

'టాలెంట్ టెస్టులతో విద్యార్థుల్లో మేధాశక్తి వృద్ధి'



మాట్లాడుతున్న కాండ్రేగుల వెంకటరమణ

అనకాపల్లి టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో మేధాశక్తిని పెంపొందించేందుకు టాలెంట్ టెస్టులు దోహదపడతాయని గౌరీ గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ అన్నారు. ప్రముఖ పోటీ పరీక్షల శిక్షణ కేంద్రం శ్రీధర్ సీసీఈ ఆధ్వర్యంలో ఏపీ పోలీస్ కానిస్టేబుల్స్ మెయిన్ టాలెంట్ టెస్టును స్థానిక గౌరీ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు టాలెంట్ టెస్ట్‌ల్లో కూడా రాణించాలన్నారు. ఇలాంటి టెస్టులు విద్యార్థులను పోటీ పరీక్షలకు సన్నద్ధం చేస్తాయన్నారు. ఈ టెస్ట్‌కు జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్ సీసీఈ సమన్వయకర్త కె.మనోజ్, గౌరీ గ్రంథాలయ కార్యవర్గ సభ్యులు విల్లూరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి జిల్లా ట్రెజరీ ఉద్యోగుల సంఘ కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

విశాఖపట్నం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి జిల్లా ఖజానా ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగరంలోని జడ్పీ కార్యాలయానికి సమీపంలో ఉన్న పెన్షనర్ల సంఘ భవనంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా యు.వెంకటేశ్, అసోసియేషన్ అధ్యక్షుడిగా పి.రాజేశ్, కార్యదర్శిగా వి.సింహాచలంనాయుడు, కోశాధికారిగా వై.వెంకటేశ్, ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఎస్.కొండలరావు వ్యవహరించారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	482
విజయనగరం	486
శ్రీకాకుళం	486

హక్కులపై అవగాహన పెంచుకోవాలి

» మహిళా సాధికారత వారోత్సవాల్లో డీఎస్పీ శ్రావణి



బొజ్జన్నకొండ వద్ద మహిళలతో డీఎస్పీ శ్రావణి

తుమ్మపాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ప్రముఖ పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండ వద్ద పోలీస్ కుటుంబాలతో కలిసి మహిళా సాధికారత వారోత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ ఎం.శ్రావణి మాట్లాడుతూ మహిళలు తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలన్నారు. మహిళల శక్తిని, మానసిక స్థైర్యాన్ని, స్వీయ రక్షణ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐలు విజయ్‌కుమార్, అశోక్‌కుమార్, స్వామినాయుడు, వెంకటనారాయణ, ఎస్ఐలు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం



సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న కూటమి నేతలు

కొత్తూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : తాజాగా అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కేటాయింపులు చేపట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు జనసేన అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం అనకాపల్లిలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పేద, బడుగు, బలహీనవర్గాలకు, రైతన్నలకు మేలు చేసేలా బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం అభినందనీయమన్నారు. పోలవరం ఎడమ కాలువకు రూ.1700 కోట్లు, సుజల స్రవంతి ప్రాజెక్టుకు రూ.600 కోట్లు కేటాయించడం గొప్ప విషయంగా పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే సుమారు ఎనిమిది లక్షల ఎకరాల సాగుకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఇక్కమాటలో చెప్పాలంటే ఇది జనరంజకమైన బడ్జెట్ అని స్పష్టం చేశారు. అనంతరం కూటమి నేతల సమక్షంలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కూటమి నాయకులు పీలా నాగశ్రీను, దూలం గోపి, చదరం నాగేశ్వరరావు, కర్రి సత్యనారాయణ, దొడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

» జనరంజక బడ్జెట్ ప్రవేశపెట్టారని కూటమి నేతలు కృతజ్ఞతలు

'మైనార్టీలకు ప్రత్యేక ప్యాకేజీ హర్షణీయం'



సమావేశంలో మాట్లాడుతున్న మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బాబర్

కశింకోట : రాష్ట్ర బడ్జెట్‌లో మైనార్టీలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడం పట్ల అనకాపల్లి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ రెహ్మాన్ (బాబర్) హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన బయ్యవరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మైనార్టీల సంక్షేమానికి కూటమి సర్కారు పెద్దపీట వేసిందనడానికి ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపులే నిదర్శనమన్నారు. గతంలో రూ.2808 కోట్లు కేటాయించగా, 2025-26 సంవత్సరానికి రూ.5,434కోట్లు కేటాయించిందని వివరించారు. ఈ సందర్భంగా ఆయన సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్, రాష్ట్ర మైనార్టీ సెల్ సంక్షేమ శాఖ, న్యాయ శాఖ మంత్రి ఎన్.ఎం.డి.ఫరూఖ్, మాజీ శాసన మండలి ఛైర్మన్ ఎం.ఎ.షరీఫ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో షేక్ అన్సర్ బేగ్, సయ్యద్ రెహ్మతుల్లా బుఖారీ, ఐఎం షరీఫ్, ఖాదర్ బాషా, ఎస్.కె.రియాజ్, గడసాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఐదున్నర దశాబ్దాల స్నేహ సుగంధం



జార్జిక్లబ్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

అనకాపల్లి టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జార్జిక్లబ్ ఆవరణలో ఆదివారం పూర్వ విద్యార్థులు సందడి చేశారు. మునిసిపల్ గవరపాలెం హైస్కూల్‌లో 1968-69 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారంతా ఓచోట చేరడంతో కోలాహల వాతవరణం నెలకొంది. తొలుత ఒకరి యోగక్షేమాలు ఒకరు అడిగి తెలుసుకున్నారు. నాటి మధుర స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. ఐదున్నర దశాబ్దాల అనంతరం అంతా కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని ప్రేమ సమాజం అధ్యక్షులు బుద్ధ శివాజీ అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎంబీవీ స్వామి, బి.కన్నాజీరావు, పడాల గణపతిరావు, కె.ఎం.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు పేకాటరాయుళ్లపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : సత్యనారాయణపురం శివారు బీఆర్టీ కాలనీ సమీపంలో పేకాట ఆడుతున్న ముగ్గురిపై ఆదివారం కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. ఈ సందరంగా వారి నుంచి 2,100 రూపాయల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని మృతదేహం

అనకాపల్లి టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : కశింకోట రైల్వే స్టేషన్‌కు సమీపంలో రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్‌పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి తెలిపారు. ఈ ఘటనపై ఆదివారం తమకు అందిన సమాచారం మేరకు ప్రమాద స్థలాన్ని పరిశీలించామన్నారు. మృతుడి వయస్సు 60 నుంచి 65 ఏళ్లు ఉంటాయని, ఎత్తు 5.3 అడుగులు, చామనఛాయ రంగు కలిగి ఉన్నాడన్నారు. తెలుపురంగు హ్యాఫ్ హ్యాండ్ షర్టు, సిమెంట్ రంగు ఫుల్‌ఫ్యాంట్ ధరించి ఉన్నట్టు చెప్పారు. మృతదేహం చుట్టుపక్కల ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు 73820 58996 నంబరుకు సమాచారం అందజేయాలని కోరారు.

ఆర్టీసీ కార్మికుల రిలే దీక్షలు

అనకాపల్లి టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ ఎన్ఎంయూఏ కార్మికులు ఆదివారం కాంప్లెక్స్ ఎదుట రిలే దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను జోనల్ ప్రెసిడెంట్ వి.ప్రదీప్‌కుమార్‌రాజు ప్రారంభించారు. దీక్షలో ఉన్న వారికి యూనియన్ నాయకులు ఏఎన్‌రావు, ఆర్ఎస్ఆర్ మూర్తి, కేవీ భూషణం, ఎంఎస్ వాసు, వేపాడ శ్రీను సంఘీభావం తెలిపారు.

పైపులైన్ ఏర్పాటు పూర్తి.. గుంతలు పూడ్చివేత అసంపూర్తి!

» ఇబ్బందులు ఎదుర్కొంటున్న శ్రీరామ్‌నగర్, గంగిరెడ్ల కాలనీ ప్రాంతాల ప్రజలు » పట్టించుకోని జీవీఎంసీ అధికారులు



గంగిరెడ్ల కాలనీలో తూ.తూ. మంత్రంగా గోతులు పూడ్చిన దృశ్యం

లంకెలపాలెం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు పరిధిలోని శ్రీరామ్‌నగర్, గంగిరెడ్ల కాలనీ ప్రాంతాల్లో తాగునీటి పైపులైన్ల ఏర్పాటు కోసం తవ్విన గోతులు పూర్తిస్థాయిలో పూడ్చకపోవడంతో నివాసితులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. ఇంటింటికీ తాగునీటి సరఫరాలో భాగంగా వీధి రోడ్లకు ఇరువైపులా తవ్వి పైపులైన్లను అమర్చారు. ఇంత వరకు బాగానే ఉన్నా, పనులు పూర్తి చేసి దాదాపు నెల రోజులు గడుస్తున్నా తవ్విన గోతులను తూ.తూ. మంత్రంగా పూడ్చారే తప్ప, ప్రత్యేక దృష్టి సారించలేదు. దీంతో మట్టి సగభాగం రహదారిపైనే పేరుకుపోయింది. ఈ కారణంగా ద్విచక్ర వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చీకటిపడితే ఈ వీధి రోడ్లలోని రావాలంటే భయమేస్తోందని నివాసితులు వాపోతున్నారు. జీవీఎంసీ అధికారులు తక్షణమే ఈ సమస్యపై స్పందించాల్సిందిగా అంతా కోరుతున్నారు.

నేత్రపర్వంగా భద్రావతి సమేత భావన్నారాయణస్వామి కల్యాణం



స్వామి, అమ్మవారిని దర్శించుకుంటున్న పీలా

అనకాపల్లి టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం భద్రావతి సమేత భావన్నారాయణ స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం కన్యకాపరమేశ్వరి జంక్షన్ నుంచి కల్యాణ వేదిక వరకు సారె ఊరేగింపు నిర్వహించారు. పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణానికి రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, వైసీపీ నాయకులు హాజరై ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నసమారాధన జరిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పంపాన సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి దొడ్డి ఈశ్వరరావు, కన్వీనర్ తిప్పాన అప్పారావు, దొడ్డి చిన్నారావు, వానపల్లి రామ్మోహనరావు, ఆకుల వెంకట అప్పారావు, కాకి ధర్మారావు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని వీక్షించారు.

నర్సింగబిల్లిలో వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు



స్వామిని దర్శించుకుంటున్న దాడి రత్నాకర్

కశింకోట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : నర్సింగబిల్లి గ్రామంలో వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. వందమంది దంపతులతో వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్‌తో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పోలమాంబ అమ్మవారి పండుగ రేపు



పరవాడ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈ.బోనంగి పంచాయతీ పరిధి ఫార్మా పునరావాస కాలనీ ప్రజల ఆరాధ్య దేవత పోలమాంబ అమ్మవారి పండుగను మంగళవారం నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకు విద్యుత్ దీపాలంకరణ చేపట్టారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆ రోజు తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి అమ్మవారి దర్శనాలు ప్రారంభం కానున్నాయి. రాత్రికి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

కొత్తూరు పంచాయతీలో ఆటో దగ్ధం

అనకాపల్లి టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తూరు పంచాయతీ రామాలయం వద్ద శుక్రవారం అర్ధరాత్రి ఆటో దగ్ధమైంది. ఇందుకు సంబంధించి పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపిన వివరాలివి. కొత్తూరు గ్రామానికి చెందిన మాటూరి శ్రీనివాసరావు రోజు మాదిరిగానే శుక్రవారం రాత్రి ఇంటికి వచ్చి ఆటోను పార్కింగ్ చేశాడు.అర్ధరాత్రి సమయంలో ఆటో మంటల్లో చిక్కుకోవడంతో పక్కింటి వారు శ్రీనివాసరావుకు విషయం తెలియజేశారు. ఆయన బయటకు వచ్చేసరికి ఆటో కాలిపోయిన ఉన్నట్టు ఎస్ఐ చెప్పారు. ఈ సంఘటనపై శనివారం రాత్రి బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పది మద్యం బాటిళ్లతో మహిళపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, మార్చి2 (ఆంధ్రజ్యోతి) : తుమ్మపాలలో మహిళ నుంచి ఆదివారం పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. అదే గ్రామానికి చెందిన కనుబుడ్డి సత్యవతి అనే మహిళ మద్యం క్వార్టర్ బాటిళ్లు కొనుగోలు చేసి వెళ్తుండగా, తుమ్మపాల వీధిలో అనుమానం వచ్చి ఆమె బ్యాగును హెడ్ కానిస్టేబుల్ బి.రామకృష్ణ పరిశీలించారన్నారు. అందులో మద్యం బాటిళ్లు లభించడంతో కేసు నమోదు చేసినట్టు చెప్పారు.